పన్ను బాదుడు

- పుర పౌరులపై ఆస్తి పన్ను భారం
- వరుసగా నాల్గవసారి పెరగనున్న వైనం
- పెరిగిన పన్ను అమలులోకి..
- మూడు జిల్లాల్లో ఆస్తి పన్ను భారం రూ.50 కోట్లు పైమాటే
- పన్ను చెల్లింపు దారుల నుంచి తీవ్ర వ్యతిరేకత





తాను అధికారంలోకి వస్తే అన్నీ పెంచుకుంటూ పోతానని ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్ అన్నారు. ఏ సంక్షేమ పథకాలో.. అభివృద్ధి పనులో అని ప్రజలు భావించారు. తీరా చూస్తే బస్సు.. కరెంటు ఛార్జీలను ఐదేళ్ల పాటు పెంచుకుంటూ పోయారు. ఆస్తి పన్ను, భూముల విలువ పెంచేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చెత్తపన్ను వసూలు చేశారు. ఆఖరికి ఖాళీ స్థలాల పైనా పన్ను వేసి జనాల నడ్డి విరగ్గొట్టారు. పెంచుకుంటూ పోతానంటూ ఆయన ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన మాటల్లో ఇంత అర్థం దాగి ఉందా అని పట్టణ వాసులు వాపోతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం పుర పౌరులపై మరోసారి ఆర్థిక భారం మోపింది. పన్ను పెరుగుదలకు హద్దే లేకుండా పోయింది. ఉన్న పన్నును 15శాతం పెంచేసింది. వరుసగా నాల్గవ ఏడాది పెంచింది. పెంచిన ఆస్తి పన్ను సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. ప్రభుత్వం బాదుడే బాదుడు అన్న నినాదాన్ని అమలు చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. చెత్త పన్నుకు తోడు ఆస్తి పన్ను పెంపుదలపై పట్టణ వాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా వీరి మొర ఆలకించే పాలకులే కరువయ్యారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పుర పౌరులపై దాదాపు రూ.50 కోట్ల ఆస్తి పన్ను భారం పడింది.

ఆస్తి పన్ను విషయంలో ప్రభుత్వ తీరు తగ్గేదేలే అన్న రీతిన జగన్ సర్కార్ వ్యవహరిస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మునిసిపాల్టీలలో ఉన్న పన్ను విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఆస్తి మార్కెట్ విలువ (రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా పన్నును విధిస్తోంది. దీని ప్రకారం ఆస్తి విలువను మార్కెట్ విలువ ప్రకారం మదింపు చేశారు. దీని ఆధారంగా ఆస్తి పన్ను ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో అద్దె విలువ, మునిసిపాల్టీలో జోన్‌ల వారీగా రేట్లు నిర్ణయించి పన్ను విధించేవారు. ఈ విధానం 1997 నుంచి అమలు అవుతోంది. భవన నిర్మాణ కొలతలను కూడా పరిగణనలోకి తీసుకునే వారు. మునిసిపాల్టీ గెజిట్ ప్రకారం జోన్‌ల వారీగా పన్ను నిర్ణయించే వారు. గతంలో భవనంకు మాత్రమే పన్ను విధించే వారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్త విధానంలో భవనంతో పాటు, ఒక వేళ భవనం చుట్టు ఖాళీ వదిలితే ఈ స్థలానికి కూడా పన్ను విధిస్తున్నారు. దీంతో పన్ను అమాంతం పెరిగింది. ప్రజల జేబును ఎన్ని విధాలుగా ఖాళీ చేయ వచ్చో మునిసిపాల్టీలలో నూతన ఆస్తి పన్ను విధానం తెలియజేస్తోంది.

- ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ఏటా పెరుగుతోంది. క్యాపిటల్ వాల్యూ ప్రకారం పన్ను నిర్ణయించిన సమయంలో గతంలో చెల్లిస్తు న్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారిస్తారు. తేడా ఉన్న పన్ను ఏటా 15శాతం పన్ను పెరుగుతోంది. మార్కెట్ విలువకు సమానం అయ్యేవరకు పన్ను ఆ మాదిరిగా పెరుగుతూనే ఉంటుంది. రూ.100 ఉన్న రూ.115కు పెరగనుంది. ఈ పన్నుల బాదుడు మునిసిపాల్టీలో ఆరంభమే కాని అంతం కాదని చెప్పవచ్చు. ఉదా హరణకు నరసరావుపేట మునిసిపా ల్టీలో పన్ను డిమాండ్ సుమారు రూ.8.59 కోట్లు దీని ప్రకారం 15శాతం పన్ను పెరగడంతో ఈ ముని సిపాల్టీ ఆదాయం దాదాపు మరో రూ.1.28 కోట్లు వరకు పెరగనున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని అన్ని పురపాలక సంఘాలు, గుంటూరు కార్పొరేషన్‌లో రూ.35 కోట్లకు పైగా ఆస్తి పన్ను భారం ప్రజలపై భారం పడనున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. పన్నులు తగ్గించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోక పోతుండటంతో ప్రభుత్వంపై పన్ను దారులు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు.



- ఓ వ్యక్తి తన ఇంటికి ఏటా రూ.690 పన్ను చెల్లించే వాడు.. దీనికి ఏటా ప్రభుత్వం 15 శాతం చొప్పున పెంచేస్తోంది. వరుసగా నాల్గవ ఏడాది ఆస్తి పన్ను పెరుగుతోంది. ఇలా పెంచిన పన్నుతో రూ.690 పన్ను కాస్తా రూ.1210కి పెరిగింది. అంటే నాలుగేళ్లలో రూ.520 పన్ను పెరిగింది. పన్ను పెంపుదలతో పాటు చెత్త పన్ను భారం కూడా జనాలపై వేస్తున్నారు. ఒక్కో ఇంటికి నెలకు 60 చొప్పున సంవత్సరానికి రూ.720 చెత్తకు పన్ను వసూలు చేస్తున్న ఘనత జగనన్న సర్కార్‌కే దక్కడటం విశేషం. మధ్య తరగతి వర్గాలపై ప్రభుత్వం పన్నుల రూపంలో మోయలేని ఆర్థిక భారాన్ని మోపడంలో జగనన్న రికార్డు సృష్టించాడని చెప్పవచ్చు.



ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు..



చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడలేకే మేము ఆందోళన చేపట్టాం. వేతనాలు పెరగడం మాటేమోగాని వచ్చే వేతనం కూడా ఆగిపోయింది. సమ్మెకాలానికి సంబంధించి 42 రోజుల జీతం ఆగిపోవడంతో మేమేం చేయాలి. మా కష్టాలు మరింత పెరిగాయి. ఆర్థికంగా చితికిపోతున్నాం.

- రేఖ, బాపట్ల జిల్లా కార్యదర్శి

సమ్మె కాలానికి వేతనమేది?

- తిరిగి విధుల్లో చేరి రెండు నెలలైనా అందని జీతాలు

- సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన ఉద్యోగులు
- నలభై రోజులకు పైగా సాగిన ఉద్యోగుల పోరాటం
- బెదిరించి, భయపెట్టి ఆందోళనను అడ్డుకున్న ప్రభుత్వం
- తొలగింపు ఆదేశాలతో ఉద్యమంపై ఉక్కుపాదం
- జీతాలు కూడా రాకపోవడంతో నిరాశలో ఉద్యోగులు

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మూడు నెలల క్రితం తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన అంగన్వాడీ ఉద్యోగులకు సమస్యల పరిష్కారం మాటెలా వున్నా వేతనాలు కూడా దక్కని పరిస్థితి వచ్చి పడింది. సమ్మె విరమించి ఇప్పటికి రెండునెలలు పూర్తయినా సమ్మెకాలానికి సంబంధించి వారికి రావాల్సిన వేతనాలు ఈరోజు వరకూ వారికి దక్కలేదు. ఇదుగో.. అదిగో అంటూ రెండు నెలలుగా నెట్టుకొచ్చిన ప్రభుత్వం వారికి వేతనాలు ఇవ్వలేక పోయింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వారికి వేతనాలు వస్తాయా? రావా? అన్న ఆందోళనలో ఉద్యోగులు అల్లాడిపోతున్నారు.

సమస్యల మాటేమోగానీ..

అంగన్వాడీ కేంద్రాలను ఏళ్లకేళ్లుగా వేధిస్తున్న సమస్యల పరిష్కారం కోసం, కనీస వేతనాల కోసం అంగన్వాడీ ఉద్యోగులు కిందటేడాది డిసెంబరు 8న సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చర్చలకు పిలవడంతో దాన్ని డిసెంబరు 12 వరకూ వాయిదా వేసుకున్నారు. చర్చల్లో ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో విధిలేని పరిస్థితిలో డిసెంబరు 12న సమ్మెకు దిగారు. ఆరోజు నుంచి ఈ ఏడాది జనవరి 23 వరకూ ప్రభుత్వం, అధికారులు ఎన్ని రకాలుగా భయపెట్టినా, బెదిరించినా, ఎస్మా ప్రయోగించినా వెరువక 42రోజులపాటు సమ్మె చేశారు. ఉద్యమ క్రమంలో చర్చల పేరుతో ఉద్యోగులను పిలిచినా ఒక్క సమస్యపై కూడా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో ఉద్యమం అంతకంతకూ పెరిగిపోయింది. ఉద్యోగులు ఎంతకీ లొంగి రాకపోవడంతో ప్రభుత్వం ఉద్యోగుల తొలగింపుకు ఆదేశాలు జారీ చేసింది. వాటిని కూడా ఉద్యోగులు లెక్క చేయక తమ ఆందోళనను కొనసాగించారు. ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులు ఇళ్లకే పంపించారు. దీంతో ఉద్యోగులు అర్ధంతరంగా తమ ఆందోళనను విరమించాల్సి వచ్చింది. ఆ తరువాత ప్రభుత్వం మరోమారు చర్చలకని పిలిచినా 2024 జూన్‌లో ఉద్యోగుల సమస్యలపై చర్చలు జరుపుతామని చెప్పింది. సమ్మె కాలానికి వేతనం ఇస్తామన్న హామీ లభించడం మినహా ఉద్యోగులకు ఏ ఒక్క హామీ కూడా దక్కలేదు. కానీ ఇప్పుడు ఆ హామీ కూడా అమలుకు నోచుకోలేదు.

రెండు నెలలుగా సాచివేత

అంగన్వాడీ ఉద్యోగులు సమ్మె విరమించి ఇప్పటికి రెండు నెలలు దాటిపోయింది. ఈ ఏడాది జనవరి 23న వారు సమ్మె విరమించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ వారికి సమ్మెకాలం 42 రోజులకు సంబంధించిన వేతనం మాత్రం దక్కలేదు. వేతనం మీదే ఆధారపడే చిరుద్యోగులు కావడంతో వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం 14,500 కంటే మూడు వేలు తక్కువ జీతం, నెలకు 11,500తో సరి పుచ్చుకుంటున్న వారికి 42 రోజుల జీతం ఆగిపోవడంతో పరిస్థితి ఒక్కసారిగా తలకిందులయింది. జీతాల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం మాత్రం దక్కలేదు. ఇదిలా కొనసాగుతుండగానే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో వారికి జీతాలు ఎప్పుడు అందుతాయనేది సమాధానం లేని ప్రశ్నగా మారింది.

రెండు నెలలైనా జీతాలు రాలేదు:

సమ్మె విరమణ చేసి రెండు నెలలైనా ఇప్పటి వరకూ జీతాలు పడలేదు. ప్రభుత్వం ఎంతో నమ్మకంగా సమ్మెకాలానికి జీతాలు ఇస్తామని చెప్పింది. అవేవీ ఇవ్వకుండానే రెండు నెలలు కాలం గడిపేసింది. ఇది కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని మాకు అనుమానం కలుగుతోంది.



- దీప్తి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్నికల కోడ్ వచ్చాక జీతాలు పడతాయా?:

ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కూడా అమలులోకి వచ్చింది. ఇక జీతాలు వస్తాయా అనేది అనుమానమే! ప్రభుత్వం ముందుగానే అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె కాలపు జీతాలు ఇవ్వాలి. కావాలనే ఎన్నికల కోడ్ వరకూ తాత్సారం చేసింది.



మెటిల్డా, పల్నాడు జిల్లా అధ్యక్షురాలు



- సుల్తానాబాద్‌లో హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న నాదెండ్ల మనోహర్

3న తెనాలికి పవన్‌కల్యాణ్

- జనసేనాని పర్యటన విజయవంతం చేస్తాం
- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన నాదెండ్ల మనోహర్

తెనాలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి ఈ నెల 3న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెనాలి రానున్నారని ఆ పార్టీ పీఏసీ ఛైర్మన్, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పవన్‌కల్యాణ్ పర్యటన, బహిరంగ సభను ఒక పండుగలాగా విజయవంతం చేస్తామన్నారు. పవన్ పర్యటనకు సంబంధించి ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, ఇతర ఏర్పాట్లను సోమవారం మనోహర్ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రత్యేక హెలికాప్టర్‌లో సుల్తానాబాద్ చేరుకునే పవన్ వారాహి వాహనంలో తెనాలిలో పర్యటిస్తారన్నారు. తర్వాత సాయంత్రం 6 గంటలకు మార్కెట్ సెంటర్‌లో జరిగే సభలో పాల్గొంటారన్నారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను మనోహర్ కోరారు. తాము అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా రూపొందించిన ఉమ్మడి మ్యానిఫెస్టోను సభలో ప్రజల ముందుంచుతారని తెలిపారు. రైతులు, కౌలు రైతులు, నిరుద్యోగులు, ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి చేపట్టబోయే పరిష్కారాలను కూడా ప్రస్తావిస్తారన్నారు. ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీకి ఎక్కువ వాహనాలకు అనుమతివ్వడం, కూటమి అభ్యర్థులకు తక్కువ వాహనాలకు అనుమతులు ఇస్తూ వివక్ష చూపే అధికారులను ఎన్నికల సంఘం చూసుకుంటుందన్నారు.

జంగా.. రాజీనామా



వైసీపీకి రాజీనామా చేసిన పత్రాలను చూపుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

- వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్ష పదవికి..
- నేటి రాజకీయాలు వ్యాపారాలుగా మారాయి
- సామాన్యుడు రాజకీయాల్లో కొనసాగటం ఇబ్బందికరంగా మారింది
- 2019లో గురజాల సీటును కాసు మహేష్‌రెడ్డి కోసం త్యాగం చేశా
- ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

6లో..

తమ్ముళ్లలో.. సమరోత్సాహం

- చంద్రబాబు ప్రజాగళం సభ సక్సెస్
- మాజీ ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ
- నేతలతో బస్సులో సమావేశమై దిశానిర్దేశం
- అధినేతకు వీడ్కోలు పలికిన టీడీపీ శ్రేణులు

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ అధినేత చంద్రబాబు బాపట్ల పర్యటన విజయవంతమైంది. సమస్యలను ఎత్తి చూపడంతో పాటు వాటి పరిష్కారం విషయంలో స్పష్టమైన హామీని ఇవ్వడంతో పాటు బాపట్ల ప్రజలకు నేనున్నా అనే సంకేతాన్ని గట్టిగా వినిపించారు. ప్రజాగళం సభ సక్సెస్ అవడం ద్వారా టీడీపీ శ్రేణులు సమరోత్సాహంతో ఉన్నాయి. ఆదివారం రాత్రి ప్రజాగళం సభ ముగిసిన అనంతరం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బస చేసిన చంద్రబాబు సోమవారం ఉదయం నేతలతో సమీక్షించారు. ఈ క్రమంలో చంద్రబాబు సమక్షంలో బాపట్ల నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. కాకినాడ జిల్లా జగ్గంపేట ఏఎంసీ ఛైర్మన్ జన్నపు రెడ్డి సుబ్బారావు టీడీపీ తీర్థం పుచ్చు కున్నారు. పలు సమస్యలపై వినతులు అందించడానికి చంద్రబాబు బస చేసిన బస్సు వద్ద పలువురు క్యూ కట్టారు. అందరి సమస్యలను విన్న టీడీపీ అధినేత అధికారంలోకి రాగానే అన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉదయం 11 గంటల సమయంలో హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు చంద్రబాబు తిరుగు పయనమయ్యారు. ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టి పాటి రవికుమార్, బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మలతో పాటు పెద్దసంఖ్య లో వచ్చిన పార్టీ శ్రేణులు చంద్రబాబుకు ఘనంగా వీడ్కోలు పలికారు.



విధ్వంసాన్ని వివరించాలి..

బాపట్ల లోక్‌సభ పరిధిలోని నియోజకవర్గాల అభ్యర్థులతో టీడీపీ అధినేత చంద్రబాబు రెండు పర్యాయలుగా సమావేశమయ్యారు. తొలుత ఆదివారం రాత్రి నాయకులతో సమీక్ష నిర్వహించిన చంద్రబాబు భవిష్యత్ కార్యాచరణపై నేతలకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం ఉదయం నేతలతో సమావేశమై ఐదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఇదే సమయంలో గెలుపుపై అతి విశ్వాసం వద్దన్నారు. గ్రామ స్థాయి కార్యకర్తలే పార్టీకి బలమని, వారి సేవలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని నేతలకు సూచించారు. బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ గతంలో ఎన్నో ప్రాజెక్టుల్లో తనదైన ముద్ర వేశారని, ఆయన ఐపీఎస్‌గా అందించిన సేవలను కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పదవులు మొదలుకుని అన్ని విషయాల్లో తమకు అన్యాయం జరుగుతుందనే విషయాన్ని ఓరుగంటి రెడ్లు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఓరుగంటి రెడ్ల సంక్షేమం కోసం టీడీపీ కట్టుబడి ఉందని తెలపడంతో పాటు వారి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను అధికారంలోకి రాగానే ఏర్పాటు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చా రు. ఈ నేపథ్యంలో ఓరుగంటి రెడ్డి సం ఘం నాయకులు సోమవారం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ భద్రత లేక బాధలు పడుతున్నామని, కనీస సౌకర్యాలు కూడా అందడం లేదని బాపట్ల జిల్లా విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు చంద్రబాబుకు వినతి పత్రం అందించారు. అధికారంలోకి రాగానే తమను పర్మినెంట్ చేసి న్యాయం చేయాలని వారు అందులో పేర్కొన్నారు.

విదేశీ విద్యను దూరం చేశారు..

విదేశీ విద్యకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందక బాధితులుగా మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం చంద్రబాబును కలిసి న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చిన బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గతంలో విదేశీ విద్యాధారణ, అంబేద్కర్ విదేశీ విద్య పేరిట స్కాలర్‌షిప్‌లు అందించి పేదలకు ఎంతో అండగా నిలిచారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం 26 జిల్లాల్లోని 359 మంది పేద విద్యార్థులకు విదేశీవిద్యసాయం అందక అల్లాడిపోతున్నారని వివరించారు. అధి కారంలోకి రాగానే అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



- నవులూరులో లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఆదెపు శివనాగేశ్వరరావు కుటుంబ సభ్యులు

అభివృద్ధే లక్ష్యం.. ఆశీర్వదించండి

- తటస్థ ప్రముఖులతో నారా లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 1: మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధితో మీ ముందుకు వచ్చా.. ఆశీర్వదించి ఈ అభివృద్ధి యజ్ఞంలో సహకారం అందించాలి.. అని యువనేత నారా లోకేశ్ కోరారు. పలువురు తటస్త ప్రముఖులను సోమవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత నవులూరులోని వ్యాపారవేత్త, మంగళగిరి ఆటోనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదెపు శివనాగేశ్వరరావును కలిశారు. చేనేతవర్గ సమస్యలను ఆయన లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. చేనేతలను ఆదుకునేందుకు మంగళగిరిలో తాను పైలెట్ ప్రాజెక్టుగా ఆరంభించిన వీవర్స్‌శాల మంచి ఫలితాలను ఇస్తుందని లోకేశ్ చెప్పారు. చేనేత ఉత్పత్తులకు జీఎస్టీనుంచి పూర్తి ఉపశమనం తీసుకురావాలన్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నానన్నారు. చేనేతలకు రెండొందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఇస్తామని చంద్రబాబు ఇప్పటికే ప్రకటించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఆ తర్వాత ఉండవల్లికి చెందిన గాదె పోలయ్యను లోకేశ్ ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో కాపులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకురాగా ఆయన వాటిపై స్పందించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక.. కాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి బలోపేతం చేస్తామన్నారు. ఉండవల్లిలో కొండవాలు ప్రాంతంలో నివశిస్తున్నవారికి పట్టాలను ఇప్పిస్తామని, నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా కృష్ణా జలాలను అందిస్తామన్నారు. అనంతరం పల్లప్రోలు నాగిరెడ్డి కుటుంబసభ్యులను లోకేశ్ ఆత్మీయంగా పలుకరించారు.



ఉండవల్లిలో లోకేశ్ సమక్షంలో కేక్‌కట్ చేస్తున్న పల్లప్రోలు నాగిరెడ్డి కుటుంబీకులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(మంగళవారం)

సహోరీ (ఉదయం) 4.45 (బుధవారం)

6న వినుకొండకు చంద్రబాబునాయుడు

వినుకొండటౌన్, ఏప్రిల్1: ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా ఈనెల 6 తేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ్య అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు వినుకొండలో పర్యటించనున్నట్లు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం తెలిపారు. కావున పార్టీ నాయకు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

గురుకుల విద్యాలయ ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు(విద్య), చిలకలూరిపేట ఏప్రిల్ 1: గురుకుల విద్యాలయాల్లో ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగించినట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాలయాల్లో 2024-25 సంవత్సరాల్లో 5వ తరగతి, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లు భర్తీ చేయడానికి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఏపీఆర్‌జేసీ(ఇంటర్), ఏపీఆర్‌డీసీ(డిగ్రీ) ద్వారా కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసే గడువు ఈనెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయాలి : ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, ఏప్రిల్1: సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో నరేంద్ర మాట్లాడుతూ ఎన్నికల ముందు అవతాత్తల పెన్షన్ల పేరుతో జగన్‌రెడ్డి సరికొత్త నాటానికి తెరతీసారన్ని ఎద్దేవా చేశారు. వలంటీర్లు మా సొంత కార్యకర్తలేనని విజయసాయి రెడ్డి, ధర్మాన ప్రసాదరావు బహిరంగంగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో 15 వేల సచివాలయాల్లో 1,50,000 మంది సిబ్బంది ఉన్నారన్నారు. 60 లక్షల సామాజిక పింఛన్లు ఈ సిబ్బంది ద్వారా ఒక్కొక్కరికి 40 చొప్పున ఒక పూటలో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయించవచ్చన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘాన్ని చీఫ్ సెక్రటరీని తెలుగుదేశం బృందం కలిసి విన్నవించిన్నట్లు చెప్పారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల సొమ్ము కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు : జీవీ

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 1: పింఛన్ల సొమ్ముతోపాటు ప్రభుత్వ నిధులు రూ.13 వేల కోట్లు తన సొంత కాంట్రాక్టర్లకు జగన్‌మోహన్‌రెడ్డి దోచిపెట్టారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయలు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. తన దుర్మార్గాన్ని కప్పి పెట్టుకోవడానికి జగన్‌రెడ్డి ఎన్నికల కమీషన్ పైన, నిమ్మగడ్డ రమేష్ కుమార్‌పైన విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. పింఛన్‌దారుల పట్ల వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే ఖజానాలో ఉన్న డబ్బును కాంట్రాక్టర్లకు దోచిపెట్టేవాడు కాదన్నారు. సచివాలయ సిబ్బంది గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించ లేకపోవడానికి జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించిన నిధులు కొరతే కారణమని, ఎన్నికల కమీషన్, తెలుగుదేశంపార్టీ కాదని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటివద్దకే నెలకు రూ.4 వేలు పెన్షన్ అందిస్తామని అన్నారు. పింఛన్ల పంపిణీ సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే చేయించాలని డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీ.. రూ.12 లక్షలు స్వాధీనం

చిలకలూరిపేట, ఏప్రిల్ 1: జాతీయ రహదారిపై చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీలు జరుపుతుండగా ఒక కారులో తరలిస్తున్న రూ.12 లక్షలు నగదు పట్టుబడ్డాయి. పోలీసులు ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు నుంచి గుంటూరుకు వెళ్తున్న వారిలో ఈ మొత్తం దొరికింది. కారులో ప్రయాణం చేస్తున్న ప్రకాశం జిల్లా పెద్దచర్లపల్లి గ్రామానికి చెందిన తాళ్ళూరి తిమోతి అనే వ్యక్తి వద్ద నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వలంటీర్ల తొలగింపు

దాచేపల్లి, ఏప్రిల్ 1: గామాలపాడులో ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో వెంకటరమణ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ సిలార్‌బాషా రాజకీయ పార్టీల నాయకులను ఉద్దేశించి పోస్టులు పెడుతూ పింఛన్ తీసుకునే వారిని భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. భైరపోగు వినయ్ అనే వలంటీర్ రాజకీయ పార్టీల ఫంక్షన్లకు హాజరుకావడంతో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి నట్లుగా భావించి విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

జంగా.. రాజీనామా

- వైసీపీ సభ్యత్వానికి, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్ష పదవికి..
- నేటి రాజకీయాలు వ్యాపారాలుగా మారాయి
- సామాన్యుడు రాజకీయాల్లో కొనసాగటం కష్టంగా ఉంది
- 2019లో గురజాలను కాసు మహేష్‌రెడ్డి కోసం త్యాగం చేశా
- ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, ఏప్రిల్ 1: వైసీపీ నాయకులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులోని జంగా కృష్ణమూర్తి స్వగృహంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకుల మధ్య రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. జంగా మాట్లాడుతూ 2019లో గురజాల నియోజకవర్గ సీటును కాసు మహేష్‌రెడ్డి కోసం త్యాగం చేశానని తెలిపారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణించిన నెలకే గురజాల నియోజక వర్గంలోని పిడుగురాళ్ల నుంచి ప్రజలతో కలిసి హైదరాబాద్‌లోని గాంధీభవన్ వరకు రాజశేఖర్‌రెడ్డికి భారతరత్న అవార్డు ఇవ్వాలని, జగన్మోహన్‌రెడ్డికి సీఎం పదవి ఇవ్వాలని పాదయాత్ర చేశానన్నారు. వైసీపీ నిర్మాణ కమిటీలో పబ్లిసిటీ కార్యదర్శిగా పని చేశాను. సీఎం జగన్మోహన్‌రెడ్డి పార్టీ పెట్టకముందు నుంచి ఆయనతో కలిసి ప్రయాణం చేసిన పది మందిలో నేనొకడిని. కానీ పదవులిస్తేనే సామాజిక న్యాయం రాదు.. దానికి తగిన గౌరవం, మర్యాద కూడా ఇవ్వాలి. కానీ అవి ఏవీ లేవు. గత 14 సంవత్సరాల్లో పార్టీలో ఎన్నో ఒడిదుడుకులు, ఇబ్బందులు, అవమానాలు భరాయించాను.



గామాలపాడులోని జంగా కృష్ణమూర్తి నివాసంలో సమావేశమైన టీడీపీ, జనసేన నేతలు

ఈ విషయాన్ని ఎన్నోసార్లు పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లాను. కానీ దానిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రజాప్రతినిధులంటే ప్రజల సొమ్ముకు ధర్మకర్తలా వుండాలి. కానీ దానికి భిన్నంగా నేటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజల సొమ్మును తన సొమ్ముగా భావిస్తున్నారు. ఇది భరించలేనటువంటి ఇబ్బంది అన్నారు. రాజకీయాల్లో ఇదే నా ఆఖరి మజిలీ కావచ్చు. ఎస్సీ ఎస్టీబీసీ, మైనారిటీలకు అండగా వుంటా. నా తుది శ్వాస వరకు బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేస్తా. గత ఐదేళ్లలో నన్ను నమ్ముకొని వున్న వారికి న్యాయం చేయలేకపోయా. అది నాకు ఎంతో బాధను గురి చేసింది. ఈ నెల 5, 6 తేదీల్లో లోకేష్ గురజాల నియోజకవర్గానికి రానున్న తరుణంలో పార్టీలో చేరతాను. క్రియాశీలకంగా పనిచేస్తానని జంగా వివరించారు. ఇప్పటికైనా నేను నా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని వీడి వెళ్లడం లేదు. బీసీ, ఎస్సీ ఎస్టీలకు సరైన గుర్తింపు, సామాజిక న్యాయం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. వైసీపీని వీడటం కష్టంగా వున్నప్పటికీ పేద ప్రజల కోసం, నన్ను నమ్ముకున్న వారికి న్యాయం చేసేందుకు పార్టీని వీడుతున్నట్లు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి స్పష్టం చేశారు. ఇప్పటివరకు తనకు సహకరించిన పెద్దలు, బీసీ వర్గ శ్రేణులు, ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు జంగా తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు అంబటి శేషగిరిరావు, భూషణం చెన్నయ్య, అంబటి నవకుమార్, మాజీ జడ్పీటీసీ కోగంటి శివన్నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, కాపు నాయకులు కొప్పుల గిరి, జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, తగుళ్ల పెదపిచ్చయ్య, మాశెట్టి పుల్లారావు, మాశెట్టి బుజ్జి, పగడాల భాస్కరరావు, బొమ్మిరెడ్డి సత్యం, కొక్కెర కొండలు, యారాసి వెంకటరావు, వేమవరం ఎంపీటీసీ శానంపూడి శ్రీనివాసరెడ్డి, జక్కా అనంతరామయ్య, కౌన్సిలర్లు షరీఫ్, మహంకాళి నీలంరాజు, ముండ్లపాటి సాంబశివరావు, సీతయ్య, గద్దల వేదమణి, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు చెందిన నాయకులు, అభిమానులు పాల్గొని జంగాకు శాలువా కప్పి తమ మద్దతు తెలిపారు.

నేడు, రేపు వ్యవసాయ కళాశాలలో జాతీయ సదస్సు

బాపట్ల, ఏప్రిల్ 1: బాపట్ల వ్యవసాయ కళాశాలలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల జాతీయ స్థాయి శాస్త్రసాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏవీ రమణ తెలిపారు. సదస్సుకు సంబంధించిన ఆహ్వానపత్రాలను సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు వ్యవసాయం, వ్యవసాయశాస్త్ర, సాంకేతిక విభాగాల ఆలంబనతో నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణ దిశగా రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగు పర్చటం అనే అంశంపై చర్చ జరుగుతుందన్నారు. పలు రాష్ట్రాలు నుంచి పీజీ, పి.హెచ్‌డి విద్యార్థులు 750 మందికి పైగా విచ్చేసి పరిశోధన పత్రాలు సమర్పిస్తారన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు డాక్టర్ వి.శ్రీనివాసరావు, డాక్టర్ డీడీ స్మిత్, డాక్టర్ ఎల్.ఏడుకొండలు, ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ డి.వి. సాయిరాంకుమార్, సహాయ ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ లాల్ అహ్మద్, డాక్టర్ వి.వెంకటవిశ్వతేజ, విద్యార్థి ఆర్గనైజింగ్ సెక్రటరీలు అక్షయ్, నగేష్, సందీప్‌వర్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఎవి.రమణ తదితరులు

బాపట్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జేడీ శీలం



బాపట్ల, ఏప్రిల్ 1: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ బాపట్ల ఎంపీ అభ్యర్థిగా మరోసారి జేడీ శీలం పోటీ చేయనున్నారు. కాకుమాను మండలం పుసులూరు గ్రామానికి చెందిన శీలం గతంలో ఐఏఎస్ అధికారిగా అనేక ప్రాంతాల్లో పనిచేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి 1999 లోకసభ ఎన్నికల్లో బాపట్ల నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ 2009 నుంచి 2014 వరకు రాజ్యసభ సభ్యుడిగా చేశారు. 2013 నుంచి 2014 వరకు కేంద్ర సహాయమంత్రిగా పనిచేశారు. రాష్ట్రవిభజన తర్వాత 2019 ఎన్నికల్లో కూడా బాపట్లలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి అతిస్వల్ప ఓట్లు మాత్రమే సాధించి ఓటమి పాలయ్యారు. తిరిగి పార్టీని బలోపేతం చేసేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధ కాగా అధిష్ఠానం ఆయన పేరును ప్రకటించింది.

వేమూరు వైసీపీ అభ్యర్థికి నోటీసు

అమృతలూరు, ఏప్రిల్ 1: వేమూరు వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబుకు నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు సోమవారం నోటీసులు జారీ చేశారు. అమృతలూరు మండలం కూచిపూడిలో ఇటీవల జరిగిన విలేకర్ల సమావేశంలో అశోక్‌బాబు మాట్లాడుతూ ఎన్నారైలు తిరిగి తమ దేశాలకు వెళ్లే పరిస్థితి ఉండదంటూ బెదిరిస్తూ మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు మీడియాలో ప్రచురితమవగా, సోషల్ మీడియాలో వైరల్‌గా మారియి. దీంతో స్పందించిన ఎన్నికల నియోజకవర్గ అధికారి అశోక్‌బాబును వివరణ కోరుతూ నోటీసు జారీ చేశారు.

వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా..

ముస్లింలను క్షమాపణ కోరిన పెమ్మసాని

మేడికొండూరు: ఏప్రిల్ 1: వీలైనంత వరకు ఎవరికైనా ఉపకారం చేసే వ్యక్తినే తప్ప ఇబ్బంది పెట్టే వ్యక్తిని కానని ముస్లింల మనోభావాలకు ఇబ్బంది కలిగినందున తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటూ క్షమాపణ కోరుతున్నట్లు టీడీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఫిరంగిపురం మండలంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి తెనాలి



రోడ్‌షోలో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని

శ్రావణ్‌కుమార్‌తో కలిసి డాక్టర్ పెమ్మసాని సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వేములూరుపాడు, అమీనాబాద్, ఫిరంగిపురం, రేపూడి, గొల్లపాలెం తదితర గ్రామాల్లో రోడ్‌షో జరిగింది. పర్యటనలో భాగంగా అమీనాబాద్ గ్రామంలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ లాంలో పలువురు వైసీపీకి చెందిన ముస్లింలు టీడీపీలో చేరితే వారిని వైసీపీ నాయకులు చెదిరించగా వారిలో మనోధైర్యాన్ని నింపేందుకే తాను కొన్ని వ్యాఖ్యలు చేశానన్నారు. ఆ వ్యాఖ్యలు కొందరు ముస్లింలకు ఇబ్బంది కలిగిం చాయని తెలిసిన వెంటనే తాను ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నానన్నారు. చాలా మందిలో బీజేపీ పొత్తుపై కొన్ని భిన్నాభిప్రా యాలు ఉన్నాయని, అయితే 2014 - 19 మధ్యలో టీడీపీ, బీజేపీ పొత్తులో ఉన్నా ఏ ఒక్క ముస్లింకు అన్యాయం జరగలేదని తెలి పారు. వేములూరుపాడు, అమీనాబాద్ గ్రామాల్లో కొండేపాక సాం బశివరావు, పీలా గోపి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 60 కుటుంబా లకు టీడీపీ కండువా కప్పి పెమ్మసాని పార్టీలోకి ఆహ్వానించారు.

పవర్ లేని మంత్రిగా సుచరిత

వేములూరిపాడులో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ వైసీపీ నుంచి పోటీ చేస్తున్న సుచరిత గతంలో హోం మంత్రిగా ఉంటూ కనీసం కానిస్టేబుల్‌ను కూడా మార్చలేని దుస్థితిలో పనిచేశారని ఆరోపించారు. దళిత మహిళ అయి ఉండి రాష్ట్రంలో ఎంతోమంది దళితులపై దమనకాండ జరుగుతున్నా స్పందించలేని స్థితిలో ఉన్నారన్నారు. ఆమె బంధువుల మాత్రం ఎక్కడికి అక్కడ ఆర్థిక వనరులే లక్ష్యంగా దోచుకున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడైనా రోడ్లు నిర్మాణం జరిగాయి అంటే అది శ్రావణ్‌కుమార్ హయాంలోనే అన్నారు. సాగునీరు లేక రైతులు కన్నీళ్లు పెట్టుకోవడం చూడలేక, ఉద్యోగాలు లేక యువత బాధపడుతుంటే చూడలేక తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఈ ప్రభుత్వాన్ని రాజకీయ సమాధి చేయాలని పెమ్మసాని పిలుపునిచ్చారు.

గ్రూప్-1 మూల్యాంకనంలో అవినీతిపై ఫిర్యాదు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 1: గ్రూపు - 1 మెయిన్ ఎగ్జామ్ పేపర్ మూల్యాంకనంలో అవినీతికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి




ఎస్ఐ సతీష్‌కు ఫిర్యాదు అందజేస్తున్న టీడీపీ నేతలు

పొనుగోటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, విశ్రాంత డీజీపీ గౌతమ్‌సవాంగ్, పోలీసు అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిలపై రెండో పట్టణ ఎస్ఐ సతీష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2018 గ్రూపు - 1 మెయిన్స్ నోటిఫికేషన్‌కు సంబంధించి 2019లో జరిగిన ప్రిలిమ్స్‌లో అర్హులైన వారికి 2020లో జరిపిన ప్రధాన పరీక్షల డిజిటల్ మూల్యాంకనంలో ఓఎంఆర్ షీట్లు మార్చి వైసీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మారుతీ, వెంకటరావు, షేక్ రఫీ, కూరపాటి హనుమంతరావు, షేక్ నాగూర్, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పల్లెల్లో కూటమికి విశేష ప్రజాదరణ

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 1: చిలకలూరిపేటతో పాటు ప్రతి నియోజకవర్గంలో ప్రజలంతా కూటమి పార్టీల వైపు



టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి ప్రత్తిపాటి

చూస్తున్నారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట మండలం గంగన్నపాలెం గ్రామానికి చెందిన 11 వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. పట్టణంలోని మాజీ మంత్రి నివాసంలో వారందరికీ పార్టీ కండువాలు కప్పి ప్రత్తిపాటి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రచారానికి వెళ్ళిన ప్రతిచోట ప్రజాదరణ కన్పిస్తుందన్నారు. పార్టీ నేతలు సమన్వయం చేసుకుని వైసీపీ గూండాల బారిన పడకుండా ప్రజలను పోలింగ్ బూత్ వద్దకు తీసుకురావాలన్నారు. సూపర్ 6 పథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యాయని, మరింత మందికి వాటిని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జవ్వాజి మదన్ మోహన్, రైతు నాయకులు అంబటి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కొడుకు హతం



గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 1: మద్యం మత్తులో కన్న కొడుకుని కడతేర్చాడు ఓ తండ్రి.. పాత గుంటూరులోని క్రిస్టియన్‌పేటలో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పాత గుంటూరు పోలీసుల కథనం ప్రకారం... పాత గుంటూరులోని క్రిస్టియన్‌పేటకు చెందిన తమనం కవిరాజు, అతని కుమారుడు మోజెస్ పాల్(29) ప్లంబర్లుగా పని చేస్తుంటారు. తండ్రీ, కొడుకు ఇద్దరు కలిసి మద్యం సేవిస్తూ ఉంటారు. మోజేష్ పాల్ కొద్దిరోజులుగా పెళ్లి చేయమని తండ్రితో తరచు గొడవ పడుతున్నాడు. ఆదివారం వారిద్దరి మధ్య బైక్ విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో తండ్రిపై కొడుకు మోజెస్ పాల్ చేయి చేసుకున్నాడు. దీంతో కోపద్రిక్తుడైన కవిరాజు పక్కనే ఉన్న మంచం కోడు తీసుకొని కొడుకుపై కొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు మోజెస్ పాల్ అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయాడు. పాత గుంటూరు పోలీసులు సంఘన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడు తల్లి శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సమీక్షలో మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ డీఐజీ పాలరాజు, ఎస్పీ వకుల్ జిందాల్

సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలి

- గుంటూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు

బాపట్ల, ఏప్రిల్ 1: పోలీసు అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ సమర్థంగా విధులు నిర్వహించాలని గుంటూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు తెలిపారు. బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లా పోలీసు అధికారులు తీసుకుంటున్న చర్యలు గురించి ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఆయన సమీక్షించారు. సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచి చెడు నడత కలిగిన వ్యక్తులను బైండోవర్ చేయాలని తెలిపారు. ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా వారిలో భరోసా కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అరెస్టు వారెంట్లను వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. చెక్‌పోస్ట్‌ల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమంగా రవాణా జరిగే నగదు, మద్యాన్ని, ప్రజలను ప్రలోభాలకు గురిచేయటానికి ఉపయోగించే బహుమతులు, వస్తువులను కట్టడి చేయాలన్నారు. రోజు ఫ్లాగ్‌మార్చ్‌లు, ఫుట్‌పెట్రోలింగ్, వాహన తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలన్నారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాలో ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు గురిం చి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, చీరాల డీఎస్పీ బి.ప్రసాద్, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఏఆర్‌డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వి.మలికార్జున, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పి.మురళీకృష్ణ, ఎలక్షన్ సెల్ సీఐలు కె.శ్రీనివాసురెడ్డి, సి.హెచ్. గంగయ్య, ఐటీ కోర్ ఎస్ఐ నాయుబ్ రసూల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మ్యానిఫెస్టోను ప్రజల చెంతకు చేర్చండి

- ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



ప్రసంగిస్తున్న ఎంపీ కృష్ణదేవరాయలు

అమరావతి, ఏప్రిల్ 1: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, రైతులు, మహిళలకు అందించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల మ్యానిఫెస్టోను వారి ముంగిటకు తీసుకు వెళ్లాలని నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. సోమవారం మండలంలోని పెదమద్దూరు, చావపాడు, ఎండ్రాయి, నరుకుళ్లపాడు, లేమల్లె, నెమలికల్లు, ముత్తాయపాలెం గ్రామా ల్లో పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌తో కలసి ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఎంపీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రతి నాయకుడు వ్యక్తిగత ద్వేషాలకు స్వస్తిపలికి అందరితో కలసి టీడీపీ కూటమికి మద్దతు పలికేలా కృషి చేయాలన్నారు. నరసరావుపేట ఎంపీగా తనను, పెదకూరపాడు శాసన సభ్యునిగా భాష్యం ప్రవీణ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా నాయకులు పనిచే యాలన్నారు. ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ తాగునీరు, సాగునీరు, రహదారుల సమస్యలు ఉన్నట్లు గమనించడం జరిగిందని అధికారంలోకి రాగానే సత్వర పరిష్కార చర్యలు చేపడతామన్నారు. పర్యాటక కేంద్రంగా అమరావతిని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి కన్నా రజని మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం 75 సంవత్సరాల వయస్సులో ఎండను లెక్కచేయకుండా సమావేశాలు నిర్వహిస్తున్న చంద్రబాబునాయుడు ను ఆదర్శంగా తీసుకుని వైసీపీ పాలనను అంతమొందించి ఉమ్మడి కూటమి ప్రభుత్వం వచ్చేలా మూడు పార్టీల నాయకులు కలసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, వెన్నా సాంబశివారెడ్డి, ఎం.గంగాధర్, ఎం.విష్ణు, కె.వసంతరావు, వి.ధర్మారావు పాల్గొన్నారు.

ఎండ్రాయి ఎంపీటీసీ టీడీపీలో చేరిక



ఎంపీ కృష్ణదేవరాయలు, భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరిన శివయ్య

అమరావతి, ఏప్రిల్1: మండలంలోని ఎండ్రాయి గ్రామ ఎంపీటీసీ సభ్యులు దేవబత్తిన శివయ్య సోమవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఎండ్రాయి గ్రామంలో జరిగిన కార్య క్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎంఎల్ఏ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరడం జరిగింది. కృష్ణదేవరాయలు శివయ్యకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజావ్యతిరేక పాలన వలన విసుగు చెంది వైసీపీ నుంచి టీడీపీలో చేరినట్లు శివయ్య తెలిపారు.

పింఛన్ల సొమ్ము పక్కదారి పట్టించిన జగన్

- టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇంటి వద్దకే రూ.4 వేలు పింఛన్
- యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల, ఏప్రిల్1: పింఛన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు వేల కోట్ల రూపాయలను ఎన్నికల కోడ్ అమలులో వున్నా సొంత కాంట్రాక్టర్లకు జగన్ దోచిపెట్టారని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీన ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని జగన్ ఎందుకు ఆదేశాలు జారీచేయలేదని, రాష్ట్రంలో 1.35 లక్షల మంది సచివాలయ ఉద్యోగుల ద్వారా యుద్ధప్రాతిపదికన పింఛన్లను ఇంటివద్దనే పంపిణీ చేసే అవకాశం వున్నా జగన్ స్వార్థరాజకీయాల వల్లనే పింఛన్‌దారులు నేడు పింఛన్ సొమ్ము తీసుకోలేకపోయారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటివద్దకే నెలకు రూ.4 వేల పింఛన్ అందిస్తామని, సకాలంలో ఇంటివద్ద లేకపోయినా పొరుగు ఊర్లలో వున్న వారికి తరువాత నెలైనా కలిపి పింఛన్ అందజేయడం జరుగుతుందన్నారు. ఎప్పటిలాగే నేడు కూడా సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్లవద్దనే పింఛన్ పంపిణీ చేయకపోతే సీఎస్ జవహర్‌రెడ్డి, సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డిపై ఎన్నికల కమిషన్ తగు చర్యలు తీసుకోవాలన్నారు. జగన్ తన దుర్మార్గాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎన్నికల కమిషన్, నిమ్మగడ్డ రమేష్‌కుమార్, తెలుగుదేశంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వలంటీర్లను ఎన్నికల కోడ్ ఉల్లంఘించే విధంగా చేసి వందల మందిని సస్పెన్షన్ చేయించడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదుకు జగన్మోహన్‌రెడ్డి కారకులయ్యారన్నారు.

పాలవ్యాన్ ఢీకొని యువకుడి మృతి

చిలకలూరిపేట, ఏప్రిల్1: జాతీయ రహదారిపై పట్టణంలోని విజయ బ్యాంక్ సెంటర్‌లో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక కుమ్మరికాలనీకి చెందిన రావూరి రామకృష్ణ(27), అతని స్నేహితుడు డేనియల్(22) తెల్లవారుజామున 2 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా ఒంగోలు నుంచి గుంటూరు వెళ్తున్న పాలవ్యాన్ ఢీకొంది. ఈ వ్యాన్ జాతీయ రహదారిపై ఉన్న గ్రిల్స్‌ను ధ్వంసం చేసుకుంటూ పక్కకు వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా డేనియల్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన యువకుడిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.03
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఏపీపీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

● జిల్లా ఎస్పీకి తెలుగుయువత, విద్యార్థి నేతల వినతి



ఎస్పీ తుషార్ డూడీకి వినతిపత్రం అందిస్తున్న తెలుగుయువత, తెలుగు విద్యార్థి నేతలు రావిపాటి సాయికృష్ణ, మన్నవ వంశీకృష్ణ తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 1: ఏపీపీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించి సీఎం జగన్, కమిషన్ చైర్మన్ గౌతం సవాంగ్‌లతో సహా బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా తెలుగు విద్యార్థి అధ్యక్షుడు మన్నవ వంశీకృష్ణ, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, టీఎన్ఎస్ఎఫ్ తూర్పు, పశ్చిమ అధ్యక్షులు నరేంద్ర, కంచర్ల ధర్మతేజలతో కలిసి గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడికి ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ 2018 గ్రూప్-1 మెయిన్స్ నోటిఫికేషన్‌కు సంబంధించి 2019లో జరిపిన ప్రిలిమ్స్, 2020లో జరిపిన మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం మాన్యువల్‌గా జరపాలని నిబంధన ఉన్నప్పటికీ కొవిడ్ సాకుతో 42వేల ఓఎంఆర్ షీట్లు మార్చి వైసీపీ ప్రభుత్వం డిజిటల్ మూల్యాంకనం చేసి భారీ అక్రమాలకు పాల్పడిందన్నారు. అప్పటి కమిషన్ బాధ్యులైన సీతారామాంజనేయులు, ఆ తరువాత వచ్చిన గౌతంసవాంగ్‌లు ఏపీపీఎస్సీని వైసీపీపీఎస్సీగా మార్చి 169 పోస్టులు అమ్ముకున్నారన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్ యాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మన్నెం శ్రీనివాసరావు, తెలుగుయువత నాయకులు చిక్కాల శివరామ కృష్ణ, శేషాద్రి సాంబశివరావు, పొత్తూరి వెంకటేశ్వరావు, నక్కా హేమంత్, విజయ్, భార్గవ్, యువత, విద్యార్థి నేతలు పాల్గున్నారు

నన్నపనేనికి భారత మహిళా శిరోమణి అవార్డు



నన్నపనేని రాజకుమారిని అవార్డుతో సత్కరిస్తున్న ప్రముఖ సినీ హాస్య నటుడు కాదంబరి కిరణ్, శివకుమార్ తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 1: మహిళా నాయకురాలు నన్నపనేని రాజకుమారికి భారత మహిళా శిరోమణి అవార్డు అందించి ఘనంగా సత్కరించారు. విజయవాడ లయన్స్ క్లబ్, ఎకెరే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయం నందు జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉభయ రాష్ట్రాలలో వివిధ రంగాలలో విశేష సేవలు అందిస్తున్న మహిళామూర్తు లకు భారత మహిళా శిరోమణి అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సి నీ హాస్యనటుడు, రచయిత, మనం సైతం సేవా సంస్థ వ్యవస్థాపకులు కధాంబరి కిరణ్, ఆస్పా భారత్ జాతీయ ఉపాధ్యక్షులు ఆక్యుపంచరిస్ట్ డాక్టర్ ముంజంపల్లి శివకుమార్ తదితరులు హాజరయ్యారు. ఉభయ రాష్ట్రాల నుంచి వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురు మూర్తులకు రాష్ట్రస్థాయి భారత మహిళా శిరోమణి అవార్డులను ప్రదానం చేశారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ మహిళా విభాగం వారి ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత విభావరి జరిగింది. గొర్తి శ్రావణి తమ గాత్రధారణలో పలు వాగ్గేయకార కీర్తలను ఆలపించారు. వీరికి మృదంగంపై సూర్య, వయోలిన్‌పై పెరవలి జయతి వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీమతి మాధవపెద్ది విజయలక్ష్మి, డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు

● మీడియా సెంటర్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన జేసీ

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల చివరి తేది వరకు నూతన ఓటు నమోదు కోసం మాత్రమే ఫారం 6 ధరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పోలింగ్ తేదీకి 10 రోజులు ముందు నాటికి అన్ని ధరఖాస్తులను పరిష్కరించి ఓటర్ల జాబితాను అప్‌డేట్ చేయటం జరుగుతుంద న్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా శిక్షణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ని ఆయన ప్రారంభించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1884 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 1500 మంది ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలలో 31 ఆగ్జిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎన్నిలక సంఘానికి ప్రతిపాదనలు పంపించటం జరిగిందని, అనుమతి మంజూరు చేస్తే జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 1915కి చేరుతుందన్నారు. జిల్లాలో ఎస్ఎస్ఆర్ 2024 తుది ఓటర్ల జాబితా ప్రచురణ జనవరి 22వ తేదీన జరిగిన నాటికి 17,69,318 మంది ఓటర్లు ఉన్నారని, కొత్తగా వచ్చిన దరఖాస్తులకు ఓటు హక్కు కల్పించడం ద్వారా ఆ సంఖ్య మార్చి 31 నాటికి 17,82,488 మందికి చేరిందన్నారు. వీరిలో పురుషులు 8,60,998 మంది, మహిళలు 9,21,333 మంది, ట్రాన్స్‌జెండర్స్ 157 మంది ఉన్నారన్నారు. సర్వీస్‌ఓటర్లు 1775 ఉన్నారని వీరికి ఈటీబీటీఎస్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించటం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు పర్యవేక్షణకు, ఉల్లంఘనలపై చర్యలు తీసుకునేందుకు 27 ఎంసీసీ, 63 ఎఫ్ఎస్‌టీ, 63 ఎస్ఎస్‌టీ, 17వీఎస్‌టీ, 7 వీవీటీ, 7 అక్కౌంటింగ్, 7 అసిస్టెంట్ ఎక్స్పెండీచర్ బృందాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, సమస్యాత్మక, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపునకు 176 సెక్టోరల్ అధికారులను నియమించటం జరిగిందన్నారు.

124 మంది వలంటీర్ల తొలగింపు... రూ 1.69 కోట్ల సీజ్

జిల్లాలో ఇప్పటి వరకు నిబంధనలు ఉల్లంఘించిన 124 మంది వాలంటీర్లు, నలుగురు కాంట్రాక్టు ఉద్యోగులు, ఒక రెగ్యులర్ ఉద్యోగిపై చర్య ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద తీసుకోవటం జరిగిందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నిర్వహించిన తనిఖీలలో ఇప్పటివరకు రూ.45.50 లక్షల నగదు, రూ.40 లక్షల విలువ కలిగిన బంగారు తదితర అభరణాలు, రూ.40.56 విలువ చేసే ఉచితంగా పంపిణీ కోసం సిద్ధ చేసిన బహుమతులు మొత్తం రూ.169.78 లక్షల నగదు, వస్తువులను సీజ్ చేయటం జరిగిందన్నారు.

15 ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు

జిల్లాలో 15 ప్రాంతాల్లో చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేశామని, వెబ్ కాస్ట్ ద్వారా తనిఖీల విధానంను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు వివిధ రాజకీయపార్టీలు అనుమతుల కోసం 488 ధరఖాస్తులు అందించగా 317 అమోదించటం జరిగిందని, సరైన మార్గదర్శకాల పాటించని 107 ధరఖాస్తులను తిరస్కరించటం జరిగిందని, 39 పరిశీలనలో ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘనలపై సీ విజిల్ యాప్ ద్వారా ప్రజలు అందించిన ఫిర్యాదులను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం 100 నిమిషాల్లోపే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు స్పందించి చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. జిల్లాలో సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 161 ఫిర్యాదులు అందాయని, వీటిలో ఎంసీసీ కి సంబంధించని ఇతర ఫిర్యాదుల మినహా 107 ఫిర్యాధులను 100 నిమిషాల్లోపే ఎఫ్ఎస్టీలు చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. జర్నలిస్టులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే సంబంధిత రిటర్నింగ్ అధికారి పరిధిలోని ఫెసిలిటేషన్ సెంటరులో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. సమావేశంలో జేసీ రాజకుమారి, ఐటీ నోడల్ అధికారి రఘు, మీడియా నోడల్ అధికారి గాలి దేముడు, సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరక్టర్ అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌ని బాధ్యతగా నిర్వహించాలి

● సీఈవో ఎంకే మీనా ఆదేశాలు



సీఈవో నిర్వహించిన వీసీకి హాజరైన కలెక్టర్, అధికారులు

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌కు సంబంధించి అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా ఆదేశించారు. సోమవారం ఆయన సచివాలయంలోని తన కార్యాలయం నుంచి పవర్ పాయింట్ ప్రజేంటేషన్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీఈవో మీనా మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు పోలింగ్ రోజున బూత్‌లకు వచ్చి ఓటు వేసేలా చైతన్యపరచాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లను మాత్రం ఫెసిలిటేషన్ సెంటర్లలోనే వేసేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫెసిలేషన్ సెంటర్స్ ఏర్పాటు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాల ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి.రాజకుమారి, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి, తెనాలి నియోజక వర్గం రిటర్నింగ్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా పాల్గొన్నారు.

ప్రముఖ రచయిత్రి తేజోవతికి పలువురు నివాళులు

గుంటూరు, ఏప్రిల్ 1: గుంటూరుకు పేరు ప్రఖ్యాతలు తెచ్చిన రచయితల్లో ఒకరైన ప్రముఖ రచయిత్రి డాక్టర్ అదరాపురపు తేజోవతి సోమవారం కన్నుమూశారు. ఈ సందర్భంగా బ్రాడీపేటలోని నివాసంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి లక్ష్మణరెడ్డి, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పలువురు ప్రముఖులు ఆమె భౌతికకాయానికి ఘన నివాళులర్పించారు. బాలికల విద్య కోసం ఉన్నవ లక్ష్మీబాయమ్మ ప్రారంభించిన శారదానికేతన్ విద్యాసంస్థ అభివృద్ధికి తేజోవతి చేసిన అవిరళ కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయినికి సత్కారం

గుంటూరు(విద్య), ఏప్రిల్1: చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన జుబేదా బేగంను సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ఇన్‌స్పెక్టర్ షేక్ మహమ్మద్ ఖాసిం, సామాజిక వేత్త రాజసుందరబాబు, బోయపాలెం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాని, మాజీ ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల డీఐ ఖైరునిస్సా తదితరలుఉ పాల్గొన్నారు.

కిడ్నాప్ చేసి రాత్రంతా హింసించారు

● మంత్రి రజని అండ ఉందని బెదిరింపులు

● బాధితుడి ఫిర్యాదుతో విచారణకు ఎస్పీ ఆదేశాలు

గుంటూరు, ఏప్రిల్ 1: నన్ను కిడ్నాప్ చేసి రాత్రంతా కారులో తిప్పుతూ హింసించారు.. మంత్రి రజని అండ ఉందని బెదిరించారు.. అని చుట్టుగుంట పరిధిలోని సాయినగర్‌కు చెందిన నన్నం నరసింహారావు సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నరసింహారావు కిడ్నాప్‌పై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం తీవ్ర కలకలం రేపింది. కిడ్నాప్ ముఠా సోమవారం తెల్లవారుజామున వదిలేయగా ఆయన తన కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఎస్పీని కలిసి నిందితులు తనను హింసించిన విధానాన్ని ఆయన ఎస్పీ తుషార్‌డూడీకి ఫిర్యాదు చేశారు. చౌత్రా ప్రాంతానికి చెందిన ఓ యువతి తాను ప్రేమించుకోగా 20 రోజుల క్రితం విషయం ఆమె ఇంటిలో తెలిసిందన్నారు. ఇదిలాఉంటే శనివారం రాత్రి ఆ యువతి అన్న ఫోన్ చేసి మాట్లాడుకుందామని సుభానీ హోటల్ వద్దకు రమ్మన్నాడన్నారు. దీంతో తాను, చందు, సుభాష్ అనే స్నేహితులతో కలసి అక్కడకు వెళ్లగా బలవంతంగా కారులోకి ఎక్కించుకుని తీసుకువెళ్లారన్నారు. అడ్డుకునేందుకు యత్నించిన నా స్నేహితులను పక్కకు నెట్టివేశారన్నారు. అనంతరం వారు నల్లచెరువు, మంగళగిరి, విజయవాడ సమీప ప్రాంతాలకు తీసుకువెళ్లి తీవ్రస్థాయిలో కొట్టి బెదిరించారన్నారు. కిడ్నాప్‌పై తల్లిదండ్రులు నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దీంతో పోలీసులు కిడ్నాపర్ ఇంటికి వెళ్ళి అతడి తమ్ముడిని అదుపులోకి తీసుకోగా ఆ విషయం తెలుసుకున్న అతడి అన్న మంత్రి విడదల రజని పేరు చెప్పి కొందరితో మాట్లాడారని బాధితుడు వాపోయాడు. తమకు మంత్రి రజని అండదండలు ఉన్నాయని, మమ్మల్ని ఎవరు ఏమీ చేయలేరని, అవసరమైతే ఎంతైనా డబ్బు ఖర్చు చేస్తామని బెదిరించారన్నారు. ఆ తర్వాత ఆదివారం ఉదయం తనను ఎక్కడైతే కిడ్నాప్ చేశారో అక్కడే వదిలివెళ్ళారన్నారు. చెల్లి గురించి ఆలోచిస్తే చంపేస్తామని, ఫిర్యాదు వెనక్కు తీసుకోవాలని బెదిరించారన్నారు. ఆతరువాత కొద్ది సేపటికి కుటుంబసభ్యులతో నగరంపాలెం స్టేషన్‌కు వెళ్ళగా అప్పటికే అక్కడ కిడ్నాపర్ పోలీసుల ముందే ఉన్నాడన్నారు. ఇంత జరిగినా పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోలేదని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తనను కిడ్నాప్ చేసిన తరుణ్‌జైన్, జిమ్‌ట్రైనర్ యూసఫ్, ఉమేష్, ఉస్మాన్ మరొకరిపై చర్యలు తీసుకుని వారి నుంచి తనకు ప్రాణ రక్షణ కల్పించాలని నరసింహారావు కోరారు. యూసఫ్ ప్రోద్బలంతోనే ఈ కిడ్నాప్ జరిగినట్లు నరసింహారావు చెప్పారు.

చర్యలు తీసుకుంటామన్నారు

దళిత యువకుడు నరసింహారావును కిడ్నాప్ చేసిన ఘటనపై విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్‌డూడీ హామీ ఇచ్చారని బాధితుడు తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో సోమవారం వెస్ట్ డీఎస్పీ మహేష్ తనను కార్యాలయానికి పిలిపించుకుని విచారించారన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిందితులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరారు.

ఘనంగా కోవెలమూడి రవీంద్ర జన్మదిన వేడుకలు



టీడీపీ జోన్ 5 రీజనల్ ఇంచార్జ్ కోవెలమూడి రవీంద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న గల్లా మాధవి, సోమేపల్లి శివప్రసాద్, మానం శ్రీనివాస్ సయ్యద్ జానీ భాషా, కల్లూరి పుల్లయ్య

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జోన్ 5 రీజినల్ కో-ఆర్డినేటర్ కోవెలమూడి రవీంద్ర(నాని) జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలోని పలువురు టీడీపీ ప్రముఖులు నాని పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. లక్ష్మీపురంలోని ఆయన కార్యాలయంలో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఐదువేల మంది టీడీపీ యువజన శ్రేణులు లక్ష్మీపురంలో భారీ ర్యాలీ నిర్వహించి సందడి చేశారు. ప్రదర్శనగా లక్ష్మీపురంలోని కార్యాలయానికి చేరుకుని పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా మత పెద్దలు సర్వ మత ప్రార్థనలు చేసి రవీంద్ర మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆశీర్వదించారు. అనంతరం జిల్లాకి చెందిన టీడీపీ నాయకులు, నగర ప్రముఖులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆయన భారీ కేక్ కట్ చేసారు. టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పిడుగురాళ్ల మాధవి, గల్లా రామచంద్రరావు దంపతులు ఆయన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని, కేక్ తినిపించి సందడి చేశారు. టీడీపీ బీసీ నేతలు తాళ్ల వెంకటేశ్ యాదవ్, నిమ్మల శేషయ్యలు నానికి శుభాకాంక్షలు తెలియజేశారు.


పశ్చిమ అభ్యర్థి కార్యాలయంలో నాని జన్మదిన వేడుకలు

తెలుగుదేశం పార్టీ జోన్ 5 రీజనల్ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర జన్మదిన వేడుకలు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి కార్యాలయంలో సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను పార్టీ శ్రేణులతో కలిసి గల్లా మాధవి కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ కోవెలమూడి రవీంద్ర లాంటి వ్యక్తులు రాజకీయాల్లో అత్యంత అరుదుగా ఉంటారని, అధినేత చంద్రబాబు నాయుడు మాటే తనకు శిరోధార్యమంటూ తన గెలుపు కోసం ఆయన చేస్తున్న కృషి మాటల్లో చెప్పలేనిది మాధవి కొనియాడారు. ఆపద సమయంలో నగర ప్రజలకు నిత్యావసర సరుకులు అందించి ఆదుకున్న ఆపద్బాంధవుడు రవీంద్ర అని ఆమె ప్రశంసించారు.

పింఛన్ల ఆలస్యానికి జగనే కారకుడు : మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పింఛన్ల ఆలస్యానికి జగనే కారకుడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో ఫించన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధులు కొరతే కారణం తప్ప ఎన్నికల కమీషన్, తెలుగుదేశం కాదని ఆయన చెప్పారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా 15 రోజుల్లో సొంత కాంట్రాక్టర్లకు రూ.13 వేల కోట్లు దోచిపెట్టింది నిజం కాదా? అని ప్రశ్నించారు. 15 వేలకు పైగా సచివాలయాల్లోని లక్షా 35వేల మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సునాయసంగా ఇళ్ల వద్దనే పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నా ఎందుకు ఆ విధంగా చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. జగన్‌రెడ్డికి వైసీపీ ముఠాకి ప్రజాసేవకంటే వలంటీర్ల ద్వారా ఓటర్లను బెదిరించడమే ముఖ్యమని, అందుకే వలంటీర్ విషయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చిన వెంటనే జగన్ శిబిరంలో వణుకు మొదలైందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4000 పింఛన్ అందిస్తుందని అన్నారు.

టీడీపీ విజయంతోనే అభివృద్ధి సాధ్యం: మహమ్మద్ నసీర్



56వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో నసీర్, టీడీపీనేతలు

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ విజయం సాధిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని గుంటూరు తూర్పు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మొహమ్మద్ నసీర్ చెప్పారు. గుంటూరు 56వ డివిజన్ నెహ్రూనగర్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మహాశక్తి, యువగళం, బీసీలకు రక్షణ చట్టం తదితర అంశాల గురించి ఆయన వివరించారు. నేడు వృద్ధులకు ఇవ్వాల్సిన పెన్షన్లు వైయస్సార్సీపీ ప్రభుత్వం వాళ్ల సామాజిక వర్గానికి చెందిన కాంట్రాక్టర్లకు నిధులు మళ్లించి ఖజానా ఖాళీ చేసిందన్నారు. టీడీపీ ఇవ్వకుండా అడ్డుపడిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు, అది పూర్తిగా అవాస్తవమని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మాజీ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ దాసరి రాజా మాస్టర్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పథకాలు ఎవరు ప్రవేశపెట్టలేదని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉద్యోగాలు రావాలన్నా చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో బత్తిన శంకర్, వార్డు ప్రెసిడెంట్ ముకుందరావు, వేములకొండ శ్రీనివాస్, గుడిపల్లి వాణి, సావిత్రి, చిన్ని, జనసేన నేతలు పులిగట్ల నాగేశ్వరరావు, పాకనాటి రమాదేవి, బిట్రగుంట మల్లికా, త్రిపుర, రామకృష్ణ, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీటీఎస్ ఆపరేషన్ థియేటర్‌లో కొత్త వెలుగులు

గుంటూరు (మెడికల్) ఏప్రిల్ 1: ప్రభుత్వ సమగ్రాస్పత్రి కార్డియోథొరాసిక్ సర్జరీ ఆపరేషన్ థియేటర్‌లో రూ.60 లక్షల వ్యయంతో అధునాతన ఎల్ఈడీ లైట్లు, వర్క్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. సోమవారం సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ ఓటీలో ఈ విద్యుత్తు లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఓటీలో వీడియో మానిటరింగ్ కూడా ఉందని, దీని వల్ల వైద్య విద్యార్థులు నేర్చుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. త్వరలో రెండో ఆపరేషన్ థియేటర్‌లో ఫ్లోరింగ్ మార్చడంతో పాటు రూ.20 లక్షల విలువైన ఓటీ లైట్లు, రూ.80 లక్షల విలువైన టీఈఈస్కాన్ ప్రోబ్‌ను అందుబాట్లోకి తెస్తున్నట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఆస్తి పన్ను వసూళ్లలో మూడో స్థానం

● చివరి రోజున రూ.5.09 కోట్ల వసూళ్లు

● కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 1: ఆస్తి పన్ను వసూళ్ళల్లో గుంటూరు నగరపాలక సంస్థ రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిందని, చివరి రోజు రూ.5.09 కోట్లు వసూళ్లు చేసిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారంఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సుమారు రూ.20 కోట్ల అన్ కలెక్టబుల్ డిమాండ్‌తో కలిపి మొత్తంగా ఉన్న రూ.143.46 కోట్ల ప్రైవేట్ డిమాండ్ గాను మార్చి 31 నాటికి రూ.98.25 కోట్లు వసూళ్లు చేయడం జరిగిందని పేర్కొన్నారు. 5 వ తేదీ వరకు ఈఆప్పీ సర్వర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సర డిమాండ్ అప్‌డేట్ చేస్తున్నందున సర్వర్ అందుబాటులో ఉండదని, 6 వ తేదీ నుండి తిరిగి అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు పనులు వేగంగా చేపట్టాలి...

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగంగా చేపట్టాలని నగర కమీషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై సోమవారం కమీషనర్ ఛాంబర్‌లో ఆయా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు మరింత విస్తృతంగా పర్యటిస్తూ, క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో సెక్టోరల్ అధికారి శ్రీధర్, ఏ.ఆర్.ఓ‌లు సునీల్, భీమరాజు, డిప్యేటీ కమీషనర్ వెంకట కృష్ణయ్య, ఈ.ఈ సుందర రామిరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమరావతి రైతుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

● డాక్టర్ రాయపాటి శైలజ



రైతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1: భవిష్యత్తు తరాల కోసం అమరావతి రైతులు చేస్తున్న పోరాటాలు స్ఫూర్తిదాయకమని రైతు నాయకురాలు డాక్టర్ రాయపాటి శైలజ కొనియాడారు. సోమవారం స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో రాజధాని రైతుల తరఫున రైతు నాయకులు డాక్టర్ వజ్జా రామలింగయ్య, విధ్వంసం పుస్తక రచయిత ఆలపాటి సురేష్, అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షులు ఆళ్ళ శివారెడ్డి, రైతు మహిళా నాయకురాలు కంభంపాటి శిరీషల సత్కార సభ నిర్వహించారు. కాకతీయ కన్వెన్షన్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ యర్ర నాగేశ్వరరావు సభకు అధ్యక్షత వ్యవహరించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శైలజ మాట్లాడుతూ సుదీర్ఘంగా పోరాడుతున్న రైతుల పోరాటం గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించగా డాక్టర్ చిట్టినేని శివ కోటేశ్వరరావు సభ నిర్వహణ నిర్వహించారు. కార్యక్రమంలో గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ కన్వీనర్ గొల్లపల్లి రాఘవేంద్రరావు, రైతు ఉద్యమ నాయకులు జమ్ముల శ్యామ్ కిషోర్, స్వరాజరావు, యుగంధర్, గోవిందమ్మ, అరుంధతి, వరలక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మెడికల్ క్యాంపులు

గుంటూరు(విద్య), ఏప్రిల్1: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉన్న ప్రత్యేక అవసరాలు విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ కోసం నేటి నుంచి ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు అదనపు ప్రాజెక్టు కోర్డినేటర్ జి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం తెనాలిలో బాలజీరావు పేట భవిత కేంద్రంలో , 3వ తేదీన పెదనందిపాడు భవిత కేంద్రంలో 4, 6తేదీలలో గుంటూరులో బ్రాడిపేటలోని జిల్లా సహిత విద్యా వనరుల కేంద్రంలో జరుగుతాయి.

కార్మికుల భద్రతకు తగు చర్యలు తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1: వేసవి దృష్ట్యా పనిచేసే ప్రదేశాలలో కార్మికుల భద్రతకై ఆయా యాజమానులు తగు చర్యలు తీసుకోవాలని ఉప కార్మిక కమీషనర్ ఏ గాయత్రిదేవి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంచినీరు. షెడ్లు, గ్లూకోజ్, ఓ ఆర్ ఎస్ ద్రావణాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వడదెబ్బకు గురైనప్పుడు ప్రథమ చికిత్సకై తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఏప్రిల్ 1: విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోరంట్ల, మల్లికార్జునపురం బాలాజీనగర్ వెంకటేశ్వర కాలనీ, శారదాకాలనీ, రెడ్డిపాలెం ఇన్నర్‌రింగ్‌రోడ్డు, రాజీవ్‌గాంధీనగర్, ఆదిత్యనగర్, భాష్యం, టైటానిక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ టి.సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కానిస్టేబుల్‌పై భార్య ఫిర్యాదు

గుంటూరు, ఏప్రిల్ 1: కోర్టులో వరకట్న వేదింపుల కేసు నడుస్తుండగానే భర్త మరో పెళ్ళి చేసుకున్నాడంటూ కానిస్టేబుల్ భార్య సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేసారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన యువతి మాలపాటి భారతి, జనార్ధన్ ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. కొంత కాలానికి వారి మధ్య మనస్పర్దలు వచ్చి విడిపోయారు. ఆ తరువాత భారతి ఫిర్యాదు మేరకు పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టు విచారణలో ఉంది. ఇదిలాఉంటే కేసు కోర్టు విచారణలో ఉండగా తన భర్త రెండో పెళ్ళి చేసుకున్నాడని బాధితురాలు సోమవారం జిల్లా ఎస్పీని కలసి ఫిర్యాదు చేశారు.

దివ్యాంగురాలైన బాలిక అదృశ్యం

గుంటూరు, ఏప్రిల్ 1: మానసిక స్థితి సరిగాలేని బాలిక అదృశ్యమైంది. అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పీఎస్ నగర్ రెండోలైనుకు చెందిన 13 ఏళ్ల బాలిక సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంటి నుంచి అదృశ్యమైంది. తల్లి హోటల్‌లో పని చేస్తుంటుంది. ఆమె హోటల్‌కు వెళ్ళగా కూతురు ఒక్కతే ఇంటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో ఆమె ఇంటినుంచి ఒక్కతే బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ తెలిసిన వారు అరండల్‌పేట పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. ఈ మేరకు అరండల్‌పేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర బలగాల కవాతు



కొత్తపేట పరిధిలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న కొత్తపేట సీఐ అన్వర్‌బాషా

గుంటూరు, ఏప్రిల్ 1: రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు గాను సోమవారం కేంద్ర బలగాలు తూర్పు నియోజకవర్గ పరిధిలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు ఈస్ట్ ఏఎస్పీ నచికేత్ షెల్కే ఆధ్వర్యంలో కొత్తపేట సీఐ అన్వర్‌బాషా కేంద్ర బలగాలైన సీఆర్‌పీఎఫ్‌లతో కలసి కవాతు నిర్వహించారు. కొత్తపేట, మాయాబజార్, పొత్తూరి వారి తోట, గుంటూరువారి తోట, ఆర్టీసీ బస్టాండ్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, 60 అడుగుల కొత్తరోడ్డు, రామిరెడ్డి తోట, నెహ్రూనగర్, బుచ్చయ్య తోట, రైల్‌పేట తదితర ప్రాంతాల్లో కవాతు చేపట్టారు.

దిక్సూచి
DIKSUCHI

జమిలి ఎన్నికలు
అనుకూల - ప్రతికూల వాదనలు

(నిన్నటి దిక్సూచి తరువాయి)

అనుకూల వాదనలు

1. మూడుస్థాయిల్లోని ప్రభుత్వాలకు విడివిడిగా ఎన్నికలు నిర్వహించేకన్నా, ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం మంచిది. తద్వారా ఎన్నికల నిర్వహణకు మూడుసార్లు అయ్యే అనేక ఖర్చులు తగ్గుతాయి. దేశంపై ఆర్థికభారం తగ్గుతుంది. ఇది ప్రభుత్వంతోపాటు రాజకీయ పార్టీలకు, వాటికి నిధులిచ్చే వాణిజ్య సంస్థలకు భారం తగ్గిస్తుంది.
2. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది మొదలు, పూర్తయ్యేవరకూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుంది. ప్రభుత్వాలు దైనందిన పాలనా కార్యక్రమాలు మినహా, కొత్త పథకాలు/ కొత్త విధానాలు చేపట్టడానికి అవకాశం ఉండదు. రెండు మూడు నెలలపాటు ఈ పరిస్థితి నెలకొంటుంది. ఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు ఒక్కోసారి లోక్‌సభ ఎన్నికలు కూడా జతయై సంవత్సరంలో సగంరోజుల పాటు ఈ క్రియాశూన్యత కనిపిస్తూ ఉంటుంది. జమిలి ఎన్నికలతో అయిదు సంవత్సరాలకు ఒకసారి కొన్ని నెలలకే దీనిని పరిమితం చేయవచ్చు.
3. మానవ వనరులపై ఒత్తిడి తగ్గుతుంది. ఎన్నికల సమయంలో భారీఎత్తున భద్రతా బలగాల తరలింపు, ప్రభుత్వాధికారులకు అదనపు పని ఒత్తిడి ఉంటుంది. జమిలి ఎన్నికల వల్ల వారిపై ఈ భారం ఒక్కసారికే పరిమితం అవుతుంది.
4. తరచూ, ఏదో ఒక స్థాయిలో ఎన్నికలు జరుగుతున్నపుడు నాయకులు నిరంతరం గెలుపు కోసం ప్రచారాలు, వ్యూహరచనలు చేయడంలో నిమగ్నమైపోతారు. ప్రజా సంక్షేమానికి పనిచేసే సమయం ఉండదు. అందువల్ల ప్రజలు ఎన్నకున్న ప్రతినిధుల చేతుల్లోంచి ప్రభుత్వోద్యోగుల చేతుల్లోకి పాలన వెళ్లి అది ప్రజాస్వామ్యాన్నే ప్రశ్నిస్తుంది.
5. అన్ని స్థాయిల్లో ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల దేశవ్యాప్త అంశాలపై ఎక్కువగా చర్చ జరిగి జాతీయ దృక్పథం అలవడుతుంది. సంకుచిత ప్రాంతీయవాద ఓటుబ్యాంకు రాజకీయాలకు తెరపడి, దేశ సమైక్యతకు, సమగ్రతకు తోడ్పడుతుంది.
6. తాత్కాలికంగా ఎన్నికల కోసం వైరుధ్య సిద్ధాంతాలున్న పార్టీలు అసంబద్ధ పొత్తులు పెట్టుకోవడం జమిలి ఎన్నికలతో తగ్గుతుంది. సిద్ధాంతపరమైన నిజాయితీకి పార్టీలు కట్టుపడతాయి.
7. పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యేల బుజ్జగింపులు వంటివి తగ్గి పాలనలో స్థిరత్వం పెరిగి పాలకులు పాలనపై దృష్టిపెట్టడానికి అవకాశం ఉంటుంది.
8. ఏవైనా కఠిన నిర్ణయాలు ప్రజాసంక్షేమం దృష్ట్యా తీసుకోవాల్సి వచ్చినప్పుడు ప్రభుత్వాలు నిర్భీతిగా వ్యవహరించవచ్చు. అయిదేళ్లకు గానీ ఎన్నికలు మరలా రానందున పదే పదే ప్రజాకర్షక ఉచిత పథకాలు వంటివి ప్రకటించాల్సిన అవసరం రెండు స్థాయిల్లోని అధికార పార్టీలకు ఉండదు. ఫలితంగా పెద్దఎత్తున ప్రజాధనం నిర్మాణాత్మక కార్యక్రమాలకు మళ్లుతుంది.
9. జమిలితో ఒకేసారి అన్నిస్థాయిల ఎన్నికల్లో ఓటు వేసే సౌలభ్యం ఉంటుంది. ఓటుహక్కు వినియోగించుకోవాలనే నైతిక ఒత్తిడి కూడా ప్రజలపై ఉండి ఓటింగ్ శాతం పెరుగుతుంది.
10. ఓటర్ల జాబితాలో సవరణలు పదేపదే చేయాల్సిన అవసరం ఎలక్షన్ కమిషన్‌కు ఉండదు. ఓటర్లు కూడా తమ ఓటుహక్కును తరచూ తనిఖీ చేసుకోవాల్సిన శ్రమ ఉండదు.
11. ఎన్నికల సమయంలో మత, సైద్ధాంతిక, ప్రాంతీయపరమైన ఉద్రిక్తలు పార్టీల ప్రయోజనాల కోసం రెచ్చగొడుతూ ఉంటారు. ఇటువంటివి తగ్గుతాయి.


ప్రతికూల వాదనలు

1. దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించడం అంటే పెద్దఎత్తున రవాణా, ఎన్నికల సామగ్రి అవసరమవుతుంది. ఉదాహరణకు ఇప్పుడున్న ఈవీఎంలకు రెండింతలు ఈవీఎంలు అవసరమవుతాయి. భద్రతా దళాల, మానవ వనరుల కొరత ఏర్పడుతుంది. ఈవీఎంల భద్రత కూడా ప్రశ్నార్థకం అవుతుంది. శాంతిభద్రతలు అదుపుతప్పినప్పుడు వెంటనే కట్టడి చేయడం కష్టం.
2. భారతదేశ జనాభాలో సాంకేతిక అవగాహన లేనివారు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఒకేసారి మూడు నాలుగు ఈవీఎంలను వినియోగించాలంటే వీరు గందరగోళపడి తప్పులు జరగడానికి అవకాశం ఉంది. తదుపరి ఎన్నికలప్పుడు అసలు ఓటు వేయడానికే వీరు ఉత్సాహం చూపకపోవచ్చు.
3. విడివిడిగా ఎన్నికలు జరిగినప్పుడే కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పనితీరులపై ప్రత్యేకంగా ప్రజలు దృష్టి సారించడానికి వీలవుతుంది. ఒకేసారి ఎన్నికలు జరిగినప్పుడు జాతీయస్థాయి చర్చే ప్రధానంగా జరిగి రాష్ట్రాల్లో కూడా జాతీయ పార్టీల ప్రభావం పడే అవకాశం ఉంది. లేదా ప్రాంతీయ పార్టీల వల్ల వర్గ, మత, ప్రాంతీయ అభిమాన ప్రభావాలకు ప్రజలు గురైనప్పుడు వాటికి అనుగుణంగా ఉన్న జాతీయ పార్టీల వైపు మొగ్గు ఏర్పడుతుంది. ఏతావతా ఆయా ప్రభుత్వాల పనితీరు విస్మరించబడుతుంది.
4. ఏదో ఒక ఎన్నికలు ఉండటం వల్ల ప్రభుత్వాలు జాగరూకతతో ఉంటాయి. లేకుంటే నియంతృత్వ పోకడలకు అవకాశం ఉంది.
5. నిధులు సమకూర్చుకోవడంలో, ఎన్నికల ఖర్చులో జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీపడలేవు. అందువల్ల ప్రాంతీయ పార్టీల ఉనికికి ప్రమాదం ఏర్పడి ప్రాంతీయ సమస్యలు, ఆకాంక్షలు గుర్తింపునకు నోచుకోవు. ఇది అశాంతికి దారితీస్తుంది.
6. జమిలి విధానంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ రద్దు, ముందస్తు ఎన్నికలను కోరే అధికారం కోల్పోతారు. కేవలం కేంద్ర ప్రభుత్వానికే ఎలక్షన్ సంబంధిత నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉండి సమాఖ్య లక్షణం ప్రశ్నార్థకమవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



నోటిఫికేషన్స్



ఏపీ పీజీసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి- పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ పీజీసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌ను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు సహా ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ, మైనారిటీ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంసీజే, ఎం.లైబ్రరీ సైన్స్, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అలాగే తెలుగు రాష్ట్రాలు మినహా ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు ప్రతి కోర్సులో 10 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు ప్రత్యేకించారు.

అడ్మిషన్స్ ఇచ్చే యూనివర్సిటీలు: ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర, శ్రీ కృష్ణదేవరాయ, ఆచార్య నాగార్జున, శ్రీ పద్మావతి మహిళ, యోగి వేమన, రాయలసీమ, విక్రం సింహపురి, ద్రవిడియన్, కృష్ణ, ఆది కవి నన్నయ, డా.బీ.ఆర్.అంబేద్కర్, డా.అబ్దుల్ హక్ ఉర్దు, క్లస్టర్, ఆంధ్ర కేసరి, జేఎన్‌టీయూఏ - ఓటీపీఆర్ఐ, స్విమ్స్-తిరుపతి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్నవారు కూడా అర్హులే. ఎంఏ ఎకనామిక్స్‌లో ప్రవేశానికి బీకాం అభ్యర్థులు; ఎంఏ(లాంగ్వేజెస్)లో ప్రవేశానికి బీఈ, బీటెక్, బీఫార్మసీ అభ్యర్థులు అనర్హులు.

ఏపీ పీజీ సెట్ 2024 వివరాలు: పీజీసెట్ 2024ను మూడు కేటగిరీల్లో నిర్వహిస్తారు. మొదటి కేటగిరీలో ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్; రెండో కేటగిరీలో కామర్స్, ఎడ్యుకేషన్; మూడో కేటగిరీలో సైన్సెస్ సంబంధిత సబ్జెక్టుల్లో పరీక్షలు ఉంటాయి.

- **మొదటి కేటగిరీ టెస్ట్‌లు:** ఇంగ్లీష్, జనరల్, తెలుగు, లిటరేచర్, సంస్కృతం, హిందీ, ఉర్దూ, తమిళం, బీఏ ఎంఏ, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ మ్యూజిక్, పర్ఫామింగ్ ఆర్ట్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, టూరిజం
- **రెండో కేటగిరీ టెస్ట్‌లు:** కామర్స్, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్
- **మూడో కేటగిరీ టెస్ట్‌లు:** లైఫ్ సైన్సెస్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్సెస్, బోటనీ, సెరీకల్చర్, జువాలజీ, మేథమెటికల్ సైన్సెస్, స్టాటిస్టిక్స్, ఫిజికల్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ సైన్సెస్, పాలిమర్ సైన్స్, జియాలజీ, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, జాగ్రఫీ
- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.
- ఎంపీఈడీ కోర్సుకు మాత్రం అభ్యర్థులు క్రీడల్లో సాధించిన విజయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. దీనికి కూడా 100 మార్కులు కేటాయించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.850; బీసీ అభ్యర్థులకు రూ.750; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.650
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 4
- **ఏపీ పీజీ సెట్ 2024 తేదీలు:** జూన్ 10 నుంచి 14 వరకు
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

సి పెట్ అడ్మిషన్ టెస్ట్

చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సిపెట్)- అడ్మిషన్ టెస్ట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. వయో పరిమితి నిబంధనలు లేవు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. హైదరాబాద్ క్యాంపస్‌లో అన్ని ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ క్యాంపస్‌లో పోస్ట్ డిప్లొమా ప్రోగ్రామ్ లేదు. మహిళలకు, పురుషులకు విడివిడిగా వసతి సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ, ఎన్‌బీఏ గుర్తింపులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా పాలిమర్స్, ప్లాస్టిక్స్, పెట్రోకెమికల్స్, మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ విభాగాలకు సంబంధించి ప్రొఫెషనల్/టెక్నికల్ ట్రెయినింగ్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా స్టయిపెండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్‌లు కూడా ఉంటాయి. ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: బీఎస్సీ ఉత్తీర్ణులు/చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ తర వాత రెండేళ్ల వ్యవధిగల కోర్సులు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్ (పీడీ-పీఎండీ-క్యాడ్/క్యామ్): ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. మూడు సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: మూడేళ్ల డిప్లొమా(మెకానికల్/ప్లాస్టిక్స్/పాలిమర్/టూల్/టూల్ అండ్ డై మేకింగ్/ప్రొడక్షన్/ఆటొమొబైల్ ఇంజనీరింగ్-మెకట్రానిక్స్/ఆటొమొబైల్/పెట్రో కెమికల్స్/ఇండస్ట్రియల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/టెక్నాలజీ) లేదా సిపెట్ నుంచి డీపీఎంటీ/డీపీటీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.

సిపెట్ అడ్మిషన్ టెస్ట్ 2024 వివరాలు: దీనిని కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. అర్హత కింద నిర్దేశించిన కోర్సు సిలబస్, జనరల్ నాలెడ్జ్ అంశాల నుంచి మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. జనరల్ నాలెడ్జ్ కింద స్పోర్ట్స్, హిస్టరీ, పాలిటిక్స్ కంప్యూటర్ సైన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, కరెంట్ అఫైర్స్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. డీపీటీ, డీపీఎంటీ ప్రోగ్రామ్‌లకు నిర్వహించే పరీక్షలో జనరల్ నాలెడ్జ్ నుంచి 25, సైన్స్ సబ్జెక్ట్ నుంచి 20, ఇంగ్లీష్ నుంచి 5 ప్రశ్నలు అడుగుతారు. పీజీ డిప్లొమా ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో జనరల్ నాలెడ్జ్ నుంచి 20 ప్రశ్నలు; సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10 ప్రశ్నలు; కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, మేథ్స్ అంశాలనుంచి మరో 10 ప్రశ్నలు ఇస్తారు. పోస్ట్ డిప్లొమాకు నిర్వహించే ఎగ్జామ్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 20; సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10; ప్లాస్టిక్స్/పాలిమర్స్, టూల్స్ రూం, ఇండస్ట్రియల్ అంశాలనుంచి మరో 10 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంట. నెగెటివ్ మార్కులు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **సిపెట్ అడ్మిషన్ టెస్ట్ 2024 తేదీ:** జూన్ 9
- **వెబ్‌సైట్:** https://cipet24.onlineregistrationform.org/CIPET/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/b8sZJaRలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

టిల్లు స్క్వేర్ చూసి ఎంజాయ్ చేశా



చిరంజీవి

ఇటీవల విడుదలై విజయం సాధించిన 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని చూసి మెగాస్టార్ చిరంజీవి బాగా ఎంజాయ్ చేశారు. వెంటనే ఆయన చిత్ర బృందాన్ని తన ఇంటికి పిలిపించుకొని ప్రత్యేకంగా అభినందించడం విశేషం. ఆయన ఆహ్వానంపై హీరో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు మల్లిక్ రామ్, నిర్మాత నాగవంశీ చిరు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'ఒక సినిమా హిట్ అయి, దానికి సీక్వెల్‌గా మరో చిత్రం వస్తుంటే అంచనాలు భారీ స్థాయిలో ఉంటాయి. వాటిని అందుకోవడం అంత తేలికైన విషయం కాదు. కానీ హీరో సిద్ధు, దర్శకుడు మల్లిక్‌రామ్, నిర్మాత నాగవంశీ.. ఇతర టీమ్ అంతా కలసి ప్రేక్షకులు మెచ్చేలా 'డీజె టిల్లు'కు సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్'ను అందించడంలో విజయం సాధించారు. అదే ఉత్కంఠ, అదే సరదా, అదే నవ్వుల జల్లు. నటుడిగా, కథకుడిగా వ్యవహరించి, ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి ప్రధాన కారణమైన సిద్ధును అభినందిస్తున్నాను.ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డామో, నిద్రలేని రాత్రులు ఎన్ని గడిపామో అని సిద్ధు నాతో చెప్పాడు. దర్శకుడు మల్లిక్ రామ్, ఎడిటర్ నవీన్ నూలి సహా అందరి సమష్టి కృషి ఉందని తెలిపాడు. విజయం సాధించిన దర్శకనిర్మాతలకు నా శుభాకాంక్షలు. 'మ్యాడ్' చిత్రంతో దర్శకుడిగా ఆకట్టుకొన్న కల్యాణ్ ఈ సినిమా రచనలో సహకారం అందించాడని విన్నాను. కేవలం యువతనే కాకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా సినిమా తీశారు. ఈ సినిమా చూసి నేను బాగా ఎంజాయ్ చేశా. మీరు చేయండి' అన్నారు.

ఫ్యామిలీ ఆడియెన్స్ మెచ్చుకునేలా...

విజయ్ దేవరకొండ, మృణాల్‌ఠాకూర్ నటించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ పెట్ల దర్శకత్వం వహించారు. దిల్ రాజు,శిరీశ్ నిర్మించారు. ఈ నెల 5న 'ఫ్యామిలీ స్టార్' విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ వేడుకకు నిర్మాత దిల్‌రాజు, విజయ్ దేవరకొండ సంప్రదాయ దుస్తుల్లో హాజరుకావడం విశేషం. దిల్‌రాజు మాట్లాడుతూ "ఫ్యామిలీ స్టార్ సినిమా విషయంలో ప్రతీ విషయంలోనూ పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది. డైరెక్టర్ కథ చెప్పగానే అందులోని పాయింట్ నన్ను ఎక్సైట్ చేసింది. ఈ సినిమాకు విజయ్ క్యారెక్టర్ వెన్నెముక లాంటిది. ఇది 30 శాతం ఫ్యామిలీ స్టోరీ, 70 శాతం లవ్ స్టోరీ. మృణాల్ లక్కీ హీరోయిన్. ఈ చిత్రంతో తెలుగులో ఆమె హ్యాట్రిక్ అందుకుంటుంది" అని అన్నారు. విజయ్ మాట్లాడుతూ "మనకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడి నేనున్నా అని చెప్పే వ్యక్తి ఫ్యామిలీలో ఒకరు ఉంటారు. ఆ ఒక్కరే ఫ్యామిలీ స్టార్. ఈ సినిమాకు, 'గీతాగోవిందం' సినిమాకు ఏ పోలిక ఉండదు. ఈ కథ వింటున్నప్పుడు మా నాన్న గుర్తొచ్చారు. అందుకే ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కి మా నాన్న పేరు గోవర్ధన్ అని పెట్టాం" అని చెప్పారు. మృణాల్ మాట్లాడుతూ "సీతారామం, హాయ్‌నాన్న తర్వాత నా నెక్స్ట్ తెలుగు ప్రాజెక్ట్ కోసం చాలా కథలు విన్నా. ఈ సినిమా కథ నాకు నచ్చడంతో వెంటనే ఒప్పేసుకున్నాను. మన జీవితాల్లోని ఎమోషన్స్, రిలేషన్స్, అచీవ్‌మెంట్స్, స్ట్రగుల్స్ అన్నీ ఈ మూవీలో రిలేట్ చేసుకుంటారు" అని తెలిపారు.



కమల్ హాసన్ మెచ్చుకున్నారు



మలయాళ మూవీ ఇండస్ట్రీలో లేటెస్ట్ సెన్సేషన్ 'మంజుమ్మెల్ బాయ్స్'. మలయాళ బాక్సాఫీస్ వద్ద రూ.200 కోట్లు కలెక్ట్ చేసిన మొట్టమొదటి సినిమాగా నిలిచింది. తమిళనాడులోని గుణ కేవ్స్‌లో జరిగిన ఓ వాస్తవ సంఘటన స్ఫూర్తితో చిదంబరం ఎస్ పొదువల్ దీనిని తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ ఏప్రిల్ 6న ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ చిదంబరం మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ మీద ముందు నుంచి అందరికీ నమ్మకం ఉంది. కానీ రూ.200 కోట్లు కలెక్ట్ చేస్తుందని ఎవరూ ఊహించలేదు. నా సెకండ్ సినిమా కథ కోసం అన్వేషిస్తుండగా గుణ కేవ్స్‌లో జరిగిన ఈ సంఘటన గురించి తెలిసింది. నన్ను ఈ కథ ఎంతగానో ఎక్సైట్ చేసింది. వెంటనే వర్క్ స్టార్ట్ చేసి, రియల్ లైఫ్ మంజుమ్మెల్ బాయ్స్‌ను కలిశా. వారు జరిగిందంతా చెప్పారు. విన్నాక ఇది ప్రజలకు తెలియాల్సిన కథ. సినిమా తీయాలి అని మరింత ధృఢంగా నిశ్చయించుకున్నాను. సినిమా చూసిన కమల్ హాసన్ మెచ్చుకోవడం పెద్ద అవార్డు గెలుచుకున్నట్లనిపించింది. మలయాళీలకు తెలుగు సినిమాలు అంటే చాలా ఇష్టం. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని ఆశిస్తున్నాను. తెలుగులో ఎంతో మంది మంచి నటులు ఉన్నారు. వారితో సినిమా చేసే అవకాశం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు.



'ఓ భామ అయ్యో రామ'



వైవిధ్యమైన చిత్రాలతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు సుహాస్. ఆయన హీరోగా నటిస్తున్న మరో వైవిధ్యమైన ప్రేమకథా చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. మాళవిక మనోజ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. రామ్ గోదాల దర్శకత్వం వహిస్తున్నారు. హరీశ్ నల్లా, ప్రదీప్ తాళ్ల నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రాన్ని ప్రారంభించి టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ "దర్శకుడు మంచి కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు" అని తెలిపారు. 'నువ్వు నేను' ఫేమ్ నటి అనిత హస్సనందని మాట్లాడుతూ "నా సెకండ్ ఇన్నింగ్స్‌కు పర్‌ఫెక్ట్‌గా కుదిరిన చిత్రమిది" అని చెప్పారు. దర్శకుడు రామ్ గోదాల మాట్లాడుతూ "ఇదొక బ్యూటిఫుల్ లవ్‌స్టోరి" అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఈ సినిమాకు ప్రారంభం నుంచే మంచి పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు, డైరెక్టర్స్ వశిష్ఠ, విజయ్ కనకమేడల, శైలేశ్ కొలను పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: భవిన్ ఎమ్.షా, సినిమాటోగ్రాఫర్: మణికందన్, సంగీతం: రథన్, కోప్రొడ్యూసర్: ఆనంద్ గడగోని.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/C5zBRWR లో చదవండి.

దర్శకుడు, అనువాద రచయిత శ్రీరామకృష్ణ కన్నుమూత



దర్శకుడు, అనువాద మాటల రచయిత శ్రీ రామకృష్ణ(74) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం క్షీణించటంతో సోమవారం రాత్రి 8 గంటలకు తేనాంపేటలోని అపోలో హాస్పిటల్‌లో కన్నుమూశారు. శ్రీరామకృష్ణ స్వస్థలం తెనాలి. 50 ఏళ్ల కిందట చెన్నైలో స్థిరపడ్డారు. ఆయనకు భార్య స్వాతి, కుమారుడు గౌతమ్ ఉన్నారు. ముంబై, జెంటిల్మన్, చంద్రముఖి తదితర 300 చిత్రాలకు పైగా అనువాద రచయితగా పనిచేసిన శ్రీ రామకృష్ణ... 'బాలమురళీ ఎంఏ', 'సమాజంలో స్త్రీ' చిత్రాలకు దర్శకత్వం వహించారు. అనువాద రచనలో రాజశ్రీ తర్వాత తనకుంటూ ఒక ప్రత్యేకత ఏర్పరచుకున్న శ్రీరామకృష్ణ మణిరత్నం, శంకర్ దర్శకత్వం వహించిన అన్ని చిత్రాలకు తెలుగులో మాటలు రాశారు, రజనీకాంత్ 'దర్బార్' చిత్రానికి చివరిగా మాటలు అందించారు. ఆయన పార్థివదేహానికి మంగళవారం ఉదయం సాలిగ్రామంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరుగుతాయని ఆయన కుమారుడు గౌతమ్ తెలిపారు.

చెన్నై(ఆంధ్రజ్యోతి)

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



చిరు వ్యాపారితో మాట్లాడుతున్న నరేంద్ర కుమార్ తదితరులు

పన్నుల భారంతో సామాన్యులు విలవిల

- పొన్నూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్
- డీవీసీ కాలనీలో విస్తృత ప్రచారం

పొన్నూరుటౌన్, ఏప్రిల్1 : వైసీపీ ప్రభుత్వం విధిస్తున్న పన్నుల భారంతో సామాన్యులు, చిరువ్యాపారులు విలవిలాడిపోతున్నారన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. సోమవారం పట్టణంలోని డీవీసీ కాలనీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ సూపర్ సిక్స్ పథకాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. పలువురు మహిళలు నరేంద్రకుమార్‌తో మాట్లాడుతూ స్వంత ఇల్లు ఉందని, కరెంటు బిల్లు అధికంగా వస్తుందని మూడేళ్ళ నుంచి పింఛన్లు నిలిపివేసారని ఆవేదన వ్యక్తం చేసారు. డీవీసీ కాలనీలో సొంత స్థలాలు ఉన్నప్పటికి ప్రభుత్వం ఇల్లు కట్టుకోవటానికి రుణం ఇవ్వటం లేదని పలువురు వాపోయారు. ప్రభుత్వం విధించే పన్నుల భారాలతో సామాన్యుల జీవనం ఇబ్బందికరంగా మారిందన్ని ఆవేదన వ్యక్తం చేసారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగటంతో రోజువారి కూలీ చేసుకోని బతికే తమకు బతుకు కష్టమైనందని వాపోయ్యారు. వీధి లైట్ల నుంచి తాగు నీటి పంపులు వరకు ఐదేళ్లలో ఏ సమస్యల చెప్పినా అధికారులు తమ మొర వినలేదని, టీడీపీ అధికారంలోకి వచ్చాక మీరైనా తమ సమస్యలు పరిష్కరించాలని నరేంద్రకుమార్‌కు విజ్ఞప్తి చేసారు. నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి పనిని చేపట్టిన దాఖలాలు లేవని ఆరోపించారు. సంక్షేమ పథకాలకు అర్హతలు అనే పేరుతో అడ్డగోళ్ళ నిబంధనలు విధించి పేదలను ఆయా పథకాలకు దూరం చేయటం దారుణమన్నారు. వైసీపీ నేతలకు దోచుకోవటం, దాచుకోవటం తప్ప ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకున్న దాఖాలు లేవని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలు వెల్లడించిన సమస్యల పరిష్కారానిపై దృష్టి సారింస్తామని తెలియజేసారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నరేంద్ర కుమార్‌ను కలిసిన బైక్ మెకానికులు

బైక్ మెకానికుల సమస్యలు పరిష్కరిస్తాం..

రానున్న రోజులో కూటమి ప్రభుత్వంలో బైక్ మెకానికుల సమస్యలు పరిష్కరిస్తామన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలియజేసారు. సోమవారం పట్టణంలోని నేతాజి నగర్‌లో బైక్ మెకానికులు నరేంద్రకుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియజేసారు. అనంతరం నరేంద్రకుమార్ బైక్ మెకానికులకు అండగా నిలుస్తామన్ని హామీనిచ్చారు. కార్యక్రమంలో పట్టణంలోని బైక్ మెకానికుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేద్దాం.. విజయం సాధిద్దాం..

- తెనాలి అసెంబ్లీ కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్
- కూటమి పార్టీల శ్రేణులతో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, మార్చి 1: రానున్న ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి టీడీపీ,జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందామని జనసేన పీఏసీ ఛైర్మన్, ఉమ్మడి పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నాదెండ్లమనోహర్ ఉమ్మడి పార్టీల శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ నియోజవర్గంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రైతాంగానికి సకాలంలో సాగునీరు అందిక అన్నదాతలు ఆందోళన బాటపట్టారన్నారు. గతంలో ఎన్నడూ కూడా రైతాంగం నీటి కోసం ఇంతగా ఆవేదన చెందిందేలేదన్నారు. ఇక నియోజవర్గవ్యాప్తంగా రోడ్ల దుస్థితిపై ప్రత్యేకంగా మాట్లాడనవసం లేదని గుంతలమయంగా మారిన రోడ్లపై అనేక మంది ప్రాణాలు కొల్పొగా మరి కొందరు క్షతగాత్రులుగామిగిలారన్నారు. వైసీపీ పాలనలో ఏ ఒక్కవర్గం కూడా సంతోషంగా ఉందిలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో రాజధానికి భూములు ఇచ్చిన రైతాంగం తమకు ప్రభుత్వం అన్యాయం చేసిందంటూ శాంతియుత నిరసనలు తెలుపుతున్నా మూడు రాజధానులంటూ మరింతగా వారిని బాధపెట్టిలా జగన్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు దుర్మార్గమని ఆక్షేపించారు. రాజధాని అభివృద్ధి చెందక ఉన్న పరిశ్రమలు తరలిపోగా కొత్త పరిశ్రమలు తీసుకురాలేక చదువుకున్న యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందించక రాష్ట్రాన్ని ప్రజానీకాన్ని తీవ్రంగా దెబ్బకొట్టిలా ప్రభుత్వ పాలన ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మరిన్ని రోజులు ఈ ప్రభుత్వ పాలన కొనసాగితే రాష్ట్రం తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని ప్రజలు కూడా ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ప్రజలందరికీ వివరించి భావితరాల భవిష్యత్తును కాపాడుకునేలా ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మనోహరనాయుడు పిలుపునిచ్చారు.

భవన నిర్మాణ రంగ కార్మికులతో ఆత్మీయ సమావేశంలో..

భవన నిర్మాణ రంగ కార్మికులతో తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇసుక కొరతతో కార్మికులు ఉపాధి కొల్పోయిన ఉదంతాన్ని ఆయన గుర్తు చేశారు. కార్మికుల రక్షణకు ఈ ప్రభుత్వం ముందుకు రాకపోగా ఉపాధి సన్నగిల్లేలా ఇసుక కృత్రిమ కొరతకు తెరలేపిందని ఫలితంగా కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితి ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ అండగా ఉండే చంద్రబాబు, పవన్ కల్యాణ్, నరేంద్రమోడీల ఉమ్మడి పార్టీల అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. తాము అధికారం చేపట్టిన వెంటనే కార్మికులకు అండగా ఉంటూ వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంతోపాటు వారి అభ్యున్నతికి పాటుబడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, పలువురు ఉమ్మడి పార్టీల నేతలు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ ద్వారా ఓటు హక్కు వినియోగం పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓటును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలి

కొల్లిపర, ఏప్రిల్ 1 : రానున్న ఎన్నికల్లో ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్విప్ కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు బైక్ ర్యాలీ నిర్వహించి ఓటు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శేషన్న మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు పెట్టే ప్రలోభాలకు తోనూ కాకుండా ఓటును వేయాలన్నారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మంచి పాలకులను ఎన్నుకోవాలన్నారు.కార్యక్రమంలో పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకర్‌రావు, ఆర్ఐ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకానిని అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి

పెదకాకాని, ఏప్రిల్ 1 : పెదకాకానిని అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని, 2026లో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన లో ఈఅంశాన్ని పరిగణలో తీసుకోవాలని పెదకాకాని అసెంబ్లీ నియోజ కవర్గ సాధన సమితి కన్వీనర్ బోయపాటి వెంకటరమణ తెలిపారు. సోమవారం పెదకాకానిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1962లో పెదకాకాని శాసనసభ నియోజకవర్గంగా ఏర్పడి ఉందని, 2009 పునర్వి భజనలో పొన్నూరు నియోజకవర్గంలో కలిపారని అన్నారు. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో పెదకాకానిని 1962లో ఉన్నట్లు గానే నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని రమణ కోరారు. సమావేశంలో గౌరవ సలహాదారుడు మనో సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ కొలికొండ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో 'సంగం'పై అసత్య ప్రచారం

పొన్నూరుటౌన్, ఏప్రిల్1: వైసీపీ నాయకులు కిలారి వెంకట రోశయ్య అంబటి మురళీ కృష్ణలు ఓటమి భయంతో సంగం డెయిరీపై అసత్య ప్రచారాలకు పూనుకున్నారని, ఇది సహేతుకం కాదని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ధూళిపాళ్ళ నరేంద్ర ఐదు సార్లు పొన్నూరు నుంచి వరుసుగా గెలుపొందటం, ప్రజాభిమానానికి ప్రతిక అన్నారు. సంగం డెయిరీ ఛైర్మన్‌గా పాడి రైతుల సంక్షేమానికి పాటుపడుతున్న నరేంద్ర కుమార్‌ను ఛైర్మన్‌గా తప్పించాలన్ని వైసిపి అభ్యర్థులు కోరటం వారి ఓటమి భయాన్ని తెలియజేస్తుందన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రిని మంత్రులను కూడా మూడు నెలలు పదవుల నుండి తప్పించి గౌవర్నర్ పాలనలో ఎన్నికలు జరిపించాలని కోరాలని వైసిపి నాయకులకు సూచించారు. రానున్న ఎన్నికలో ప్రజలు వైసిపి పాలకులకు తగు రీతిలో బుద్ధి చెబుతారన్ని హెచ్చరించారు.

చర్చిలో ఎన్నికల ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 1: పొన్నూరు పట్టణంలోని క్రీస్తు శతవార్షిక లూథరిన్ దేవాలయంలో గత నెల 31వ తేదీన వైసీపీ ఎంపీ అభ్యర్థులు ఎమ్మెల్యే అభ్యర్థులు కిలారి వెంకట రోశయ్య, అంబటి మురళీకృష్ణ చేసిన ఎన్నికల ప్రచారంపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసారు. ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రార్ధనలో ఉన్న క్రైస్తవుల వద్దకు వెళ్లి చర్చిలో ఓట్లు అభ్యర్థించటమే కాకుండా గతంలో చేసిన పన్నుల తాలూకు వివరాలను వెల్లడించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పవిత్రమైన చర్చిలో రాజకీయ ఉపన్యాశాలు చేయటం నేరం, ఎన్నికల నియమావలిని ఉల్లంఘించటమేనన్నారు. మతపరమైన ప్రాంతంలో ఓటర్లను ప్రభావితం చేస్తూ ప్రలోభాలకు గురిచేస్తూ వాగ్దానాలు, హామీలు ఇచ్చిన కిలారి వెంకట రోశయ్య, అంబటి మురళీకృష్ణపై ఈసీ చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

- మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 1: ఎన్నికలలో ప్రజలందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోవాలని మున్సిపల్ కమీషనర్ బి శేషన్న పిలుపు నిచ్చారు. పట్టణంలో సోమవారం భారత ఎన్నికల సంఘం వారి ఆదేశాల మేరకు, రానున్న సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో స్వీప్ (ఎస్‌వీఇఇపీ) లో భాగంగా ప్రజలకు మున్సిపల్ కమీషనర్ బి శేషన్న ఓటు వినియోగంపై అవగాహనా ర్యాలీ కార్యక్రమాన్ని ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ శేషన్న మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో యువతరం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ప్రజలు విలువైన తమ ఓటును వినియోగించుకొని, స్వేచ్ఛగా ఎటువంటి ప్రభోవాలకు లోనుకాకుండా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. ముందుగా రజకపేటలోని చాకలి ఐలమ్మ పార్కు నుండి చినరావూరులోని సత్యనారాయణ పార్కు వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం చినరావూరు పార్కు వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ అనూష, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు జడ్ సుధాకర్, ఎస్ఎల్ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఏ.రామచంద్రరావు, డీ.శ్రీనివాసరావు, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో మునిసిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లు శేషన్న, అనూష



ఈవీఎంలపై ఆర్వోలకు అవగాహన

పొన్నూరుటౌన్, ఏప్రిల్1: నియోకవర్గంలోని సెక్టార్, రూట్ ఆఫీసర్లకు ఈవీఎం, వీవీప్యాట్ల నిర్వహణ, వినియోగంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్ ఏ.లక్ష్మీ కుమారి ఆదేశాల మేరకు మాస్టర్ ట్రైనర్లు ఈవీఎం యూజర్ మాన్యువల్‌పై అవగాహన కల్పించారు. పోలింగ్ బూత్‌లలో ఈవీఎం, వీవీప్యాట్లు ఏర్పాటు చేయటం నుంచి వాటిని నిర్వహించటం, పోలింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారులు, రూల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భక్తి శ్రద్ధలతో ఛండీ నవవిధ శాంతి హోమం



ప్రత్యేక పూజలందుకున్న కనకదుర్గా దేవి

పొన్నూరుటౌన్, ఏప్రిల్1: పట్టణ శివారులోని జీబీసీ రోడ్డులో వేంచేసివున్న కనకదుర్గా భవాని ఆలయంలో సోమవారం ఛండీ నవ విధ శాంతి హోమం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఆలయ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకోని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ నెల 4వ తేది వరకు ఆలయంలో మహాఛండీ యాగం కోటి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను చేసారు. సోమవారం గోపూజ నిర్వహించి ఛండీనవవిధ శాంతి హోమం జరిపారు. అనంతరం సహస్ర జ్యోతిలింగార్చన కార్యక్రమంలో భాగంగా వెయ్యి మట్టి శివలింగాలకు పంచామృత అభిషేకాలు జరిపారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్ని పూజలు చేసారు.

పట్టణంలో దోమల నివారణకు చర్యలు

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 1: పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలో పలు వార్డులలో సోమవారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆటోలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శానిటేషన్ అధికారులు పర్యవేక్షించారు. ఇటీవల పట్టణంలో దోమల బెడద ఎక్కువైందని స్థానిక ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మునిసిపల్ అధికారులు ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులచే ఫాగింగ్ చేపట్టారు.



ఫాగింగ్‌ను నిర్వహిస్తున్న మునిసిపల్ కార్మికులు

ఒలంపియాడ్‌లో నెహ్రూనికేతన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎండీ మురళీకాంత్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 1 : ఒలంపియాడ్ పరీక్షల్లో నెహ్రూనికేతన్ విద్యార్థులు ప్రతిభ చూపారు. న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ ఫౌండేషన్ ఈఏడాది జనవరిలో జాతీయ స్థాయి లో పోటీలు నిర్వహించింది. వీటిలో పాల్గొన్న విద్యార్థులు ఆరు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం సాధించారు. దక్షిత, హర్విండ్, ఈశ్వర్‌బాబు, జయ శ్రీనివాస్, శ్రీసాత్విక, సనాఫాతిమా పతకాలు పొందిన వారిలో ఉన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎండీ మురళీకాంత్ అభినందించారు.

సారస్వత పరిషత్‌కు రచయిత హకీంజాని కథ ఎంపిక

తెనాలి అర్బన్, ఏప్రిల్ 1 : తెలంగాణాలోని సారస్వత పరిషత్ రూపొందించే బాలల కథ సంకలనంలో తన కథ ఎంపికైందని తెనాలి రచయిత అబ్దుల్ హకీం జాని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన రాసిన నాలుగు గుండిగలు కథను ప్రచురణకు తీసుకున్నారని తెలిపారు. రచయితలు పంపిన 317 కథల నుంచి 117 కథలను ఎంపికచేసి ప్రచురిస్తారన్నారు.

ఓటు అనే వజ్రాయుధంతో వైసీపీకి బుద్ధి చెప్పాలి

దుగ్గిరాల, ఏప్రిల్ 1: రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతిని నిర్వీర్యం చేస్తూ మూడు ముక్కలాటకు యత్నించిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తమ విలువైన ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని అమరావతి ప్రాంత రైతుల జేఏసీ కన్వీనర్ పువ్వాడ సుధాకర్ అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర రాజధాని గా అమరావతి ఆవశ్యకతను తెలియజేస్తూ, రాష్ట్రాభివృద్ధి కోసం సంపదను సృష్టించే నాయకులను ఎన్నుకోవాలంటూ, దుగ్గిరాలలో ఇంటింటికీ తిరిగి అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో మల్లేశ్వరి, జయసత్య, ఉమమహేశ్వరి, శ్రీఅనిత పాల్గొన్నారు.



ఈసీ నిర్ణయాన్ని టీడీపీకి ఆపాదించటం సిగ్గుచేటు

- రాజధాని దళిత బహుజన జేఏసీ

తుళ్లూరు, ఏప్రిల్ 1: వైసీపీ కార్యకర్తలు వలంటీర్లు అని, స్వచ్ఛందం గా పని చేసే వారిని వలంటీర్లు అంటారని సీఎం జగన్‌రెడ్డి వారి నియామకం సమయంలో పేర్కొన్నారు. మరి ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీకి చెందిన వలంటీర్లు పింఛన్ పంపిణీ విషయంలో పక్కన పెట్టాలని కేంద్రఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని తెలుగుదేశం పార్టీకి ఆపాదించటం వైసీపీచేస్తున్న ప్రచారం నీచమైనదని రాజధాని అమరావతి దళి త బహుజన జేఏసీ అధ్యక్షుడు చిలకా బసవయ్య అన్నారు. సోమవారం రాయపూడిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటే టీడీపీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ అసత్య ప్రచరాలు నమ్మవద్దని సూచించారు. ఇటువంటి అబద్ధాల పాలన ప్రజలు తిరసక్కరించి జనసేన బీజేపీ బలపర్చిన టీడీపీ ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులను గెలిపించటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించి విగ్రహాలు పెడతారా?

- విదేశీ విద్య పథకానికి తిరిగి అంబేద్కర్ పేరు పెడతాం
- ఉండవల్లి రచ్చబండ సభలో యువనేత నారా లోకేశ్

మంగళగిరి,మార్చి1: రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనబెట్టి ఆయన తాత రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు, అంబేద్కర్‌ను అవమానిస్తూ ఆయన పేరిట ఉన్న విదేశీ విద్య పథకం పేరును జగనన్న విదేశీ విద్యగా మార్చేశారు, అంబేద్కర్‌ను అవమానించి విగ్రహాలు పెడితే సరిపోతుందా అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉండవల్లి ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరు పెడతామన్నారు విధ్వంసంతో జగన్‌రెడ్డి పాలన మొదలైందని, టీడీపీ అధికారంలోకి రాగానే మంగళగిరికి పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, రాజధాని నిర్మాణ పనులను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఉండవల్లి వాసులు తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తెస్తూ.. 'మా ప్రాంతంలో డ్రెయిన్లు నిర్మించాలి. ఇళ్లులేని వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలి. రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. చదుకున్న పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తిచేశారు. మా ప్రాంతంలో తాగునీటి కోసం గ్రామస్థులు సొంత నిధులతో మోటారు ఏర్పాటుచేసుకుంటే అధికారులు వేధిస్తున్నారని వాపోయారు. దీంతో మోటారు పెట్టాలని, ఎవరు అడ్డువస్తారో చూస్తానని లోకేశ్ వారికి భరోసా ఇచ్చారు. ఉండవల్లి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణంతో పాటు ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందిస్తాం. ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించి పట్టాలు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

మంగళగిరి: 'గత ఎన్నికల్లో గెలిచినోళ్లంతా నియోజకవర్గాన్ని గాలికొదిలేశారు. నేనలా కాదు. ఓడినా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని సేవలందిస్తున్నా. ఇక్కడ సమస్యలను గురించి పూర్తిగా అధ్యయనం చేశా. ఏ ప్రాంతంలో ఏయే సమస్యలు వున్నాయో నాకే బాగా తెలుసు. ఆ సమస్యలన్నింటిని పరిష్కరిస్తా...మీ బిడ్డలా నన్ను ఆదరించి ఆశీర్వదించి గెలిపించండి' అంటూ టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ ప్రజలను అభ్యర్థించారు. వినూత్నమైన రీతిలో ప్రచారాన్ని నిర్వహిస్తున్న లోకేశ్ సోమవారం నియోజకవర్గంలోని మంగళగిరి గండాలయపేట, తాడేపల్లి ప్రాంతంలోని ప్రకాష్‌నగర్, ఉండవల్లి ఎస్సీకాలనీలలో ఏర్పాటుచేసిన రచ్చబండ కార్యక్రమాలలో పాల్గొని ప్రసంగించారు. మంగళగిరికి పరిశ్రమలే రావని ఎమ్మెల్యే ఆళ్ల నిస్సిగ్గుగా చెబుతున్నారన్నారు. పరిశ్రమలను తెప్పించడం మీకు సాధ్యం కాకపోవచ్చు... మాకు కాదు. గత ప్రభుత్వ హయాంలో మంగళగిరికి నేను తెచ్చిన ఐటీ కంపెనీలు కానరావడం లేదా?. మంగళగిరికి కోకాకోలా, దుగ్గిరాలకు కాఫీ ఫ్యాక్టరీలు రాలేదా? ఇవన్నీ మీకు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. గండాలయపేట వాసులకు గత ఎన్నికల సందర్భంగా కోర్టుకెళ్లయినా సరే నివేశన పట్టాలిప్పిస్తానని చెప్పిన ఆళ్ల.. కనీసం కోర్టులో కేసు కూడ వేయలేదని లోకేశ్ ఎద్దేవా చేశారు. ఇక్కడి దేవాదాయశాఖ భూముల్లో చిరకాలంగా నివాసం వుంటున్నవారికి సమస్యను కోర్టు ద్వారా పరిష్కరించి అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోగా పట్టాలిప్పిస్తామని హామీనిచ్చారు. అలాగే కొండపోరంబోకు, అటవీ భూముల్లో నివాసం వుంటున్నవారికి కూడ పట్టాలిచ్చే బాధ్యతను తానే స్వీకరిస్తున్నానని చెప్పారు. తన తాత ఎన్టీఆర్ హయాంలో స్థానికంగా కొందరికి నివేశన పట్టాల పంపిణీ జరిగినట్లు తన దృష్టికివచ్చి చాల సంతోషించానన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే మిగిలినవారికి తాను నివేశన పట్టాలను పంపిణీ చేయిస్తానని లోకేశ్ హామీ నిచ్చారు. గండాలయపేటలో ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలను ఇప్పించి నీటి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించగలనని చెప్పారు. గత ఎన్నికల్లో లోకేశ్ గెలిస్తే పేదల నివాసాలను కూల్చివేయిస్తాడనే కట్టుకథలను అల్లి గెలిచారు. గెలిచాక ఆత్మకూరు, ఇప్పటం, ముఖ్యమంత్రి ఇంటి సమీపంలోని పేదల నివాసాలను కూల్చి వేయించిందెవరని ప్రశ్నించారు. పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయించి ఇపుడు ఏ మొఖం పెట్టుకుని ప్రజల వద్దకు వచ్చి ఓట్లడుగుతున్నారు. ఆరునెలల క్రితం ఎమ్మెల్యే ఆళ్ల సీఎం జగన్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని, తనకు ఇస్తానన్న మంత్రి పదవిని ఇవ్వలేదని, పేదల నివాసాలకు పట్టాల పంపిణీ చేయడం లేదని ఆరోపిస్తూ ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు, మళ్లీ రెండు నెలలకే రాజీ కుదుర్చుకున్నట్లు నటించేసి నాటకాలాడుతున్నాడు.. అందుకే తాను కరకట్ట కమలహాసన్‌గా ఆళ్లకు పేరుపెట్టానన్నారు. గతంలో తమ టీడీపి ప్రభుత్వం అమలు చేసిన వంద సంక్షేమ పథకాలన్నీ రద్దుచేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించి ఆయా వర్గాలవారికి జగన్ తీరనిద్రోహం చేశారని లోకేశ్ విమర్శించారు. కుర్చీల్లేని కార్పోరేషన్లు పెట్టి వారి సంక్షేమానికి ఒక్క రూపాయి కూడ కేటాయించలేదన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఓటర్లుగా వున్న చంద్రబాబు, పవన్ కూడ మంగళగిరి అభివృద్ధిలో భాగస్వాములవుతారన్నారు. పెన్షన్ల పంపిణీలో వలంటీర్లపై ఎన్నికల కమిషన్ ఆంక్షలను విధించడానికి వైసీపీనే కారణమని లోకేశ్ ఆరోపించారు. వలంటీర్లను రాజకీయ అవసరాలకు వినియోగించడం వల్లనే ప్రస్తుత పరిస్థితికి కారణమని ఆయన చెప్పారు. సంక్షేమాన్ని రాష్ట్రానికి పరిచయం చేసింది...తొలిసారి పెన్షన్లను ప్రవేశపెట్టింది ఎన్టీఆరేనన్న సంగతిని ఎవ్వరూ మర్చిపోరాదన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెన్షన్‌ను రూ నాలుగువేలకు పెంచి ఇంటివద్దే అందజేస్తామని అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారని లోకేశ్ గుర్తుచేశారు.



గండాలయపేటలో స్థానికులతో మాట్లాడుతున్న నారా లోకేశ్

కార్యక్రమాలలో టీడీపీ నేతలు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్ధయ్య, దామర్లరాజు, తమ్మిశెట్టి జానకీదేవి, గోసాల రాఘవ, గోవాడ దుర్గారావు, బోగి వినోద్, పడవల మహేష్, షేక్ రియాజ్, పేరం ఏడుకొండలు, యుద్ధం అప్పారావు, నల్లగొర్ల శివరామకృష్ణ, బాపనపల్లి వాసు, కోసూరు రాజశేఖర్, రంగిశెట్టి బాబీ, సుఖమంచి వెంకట గిరి, పోలుమట్ల ప్రేమ్‌కుమార్, మహ్మద్ ఇబ్రహీం,షేక్ సుభానీ, వల్లభనేని వెంకట్రావు, రాయపూడి కిరణ్, దారా దాసు, అద్దంకి మురళి, ఇట్టా పెంచలయ్య, ఇట్టా భాస్కర్, అన్నే కుసుమ, పత్తినపల్లి కృష్ణవేణి, దానబోయిన సుందరరావు యాదవ్, గాదె శ్రీనివాసరావు, దాసరి కృష్ణ, గాదె బసివిరెడ్డి, దొప్పలపూడి జ్యోతిబసు, జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, మునగపాటి వెంకట మారుతీరావు, జంజనం వెంకట సాంబశివరావు, తిరుమలశెట్టి కొండలరావు, సామల నాగేశ్వరరావు, వర్రే మహేష్ పాల్గొన్నారు.